APTEL 2009/31957

# నీలగిరి వార్త

మన కోసం మన వార్త తెలుగు దినపత్రిక

neelagirivartha@gmail.com



హైదరాబాద్‌లో దేశంలోనే అతిపెద్ద ఫ్రూట్ మార్కెట్ 2లో



దిల్‌సుఖ్ నగర్ పేలుళ్లపై నేడు తీర్పు 2లో

ఏపీ & తెలంగాణ | ఎడిటర్ : గుంటోజు విష్ణుమూర్తి | మంగళవారం | 08-04-2025 | సంపుటి : 15 | సంచిక : 251 | పేజీలు : 12 | వెల : 5/- | అసోసియేట్ ఎడిటర్ : చెన్నూరి అన్వేషి

# రూ.50 ఎక్కిందీ!

- మరోమారు వాతలు పెట్టిన కేంద్రం
- గ్యాస్ ధర సిలిండర్‌కు రూ.50 పెంపు
- పెట్రోల్‌పై ఎక్సైజ్ సుంకాలు అదనం

**న్యూఢిల్లీ- నీలగిరివార్త :** పెట్రోల ధరలతో పాటు, గ్యాస్ ధరలు భగ్గుమన్నాయి. సార్వత్రిక ఎన్నికలు ముగిసాక మరోమారు కేంద్రం వాతలు పెట్టింది. ధరలతో మరోమారు సామాన్యులపై తీవ్ర ప్రభావం పడనుంది. ఇప్పటికే పెరిగిన ధరలతో కుదేలవుతున్న సగటు జీవిపై ధరలమోత పడనుంది. వంట గ్యాస్‌పై ఒక్కో సిలండర్‌పై రూ.50 పెంచింది. ఈ మేరకు పెట్రోలియం శాఖ మంత్రి హరిదీప్ సింగ్ పూరీ సోమవారం న్యూఢిల్లీలో వెల్లడించారు. ఈ పెంపు ధర ఉజ్వల్ యోజన పథకం ద్వారా సిలండర్ పొందుతున్న లబ్దిదారులకు సైతం వర్తిస్తుందని స్పష్టం చేశారు. దీంతో 14.2 కేజీ ఎల్పీజీ సిలండర్ ధర ప్రస్తుతం రూ. 803 ఉంటే.. ఇకపై దీని ధర రూ. 853 అవుతుందని తెలిపారు. అలాగే ఉజ్వల్ యోజన పథకం కింద అందుకొంటున్న సిలండర్ ధర రూ. 503 నుంచి రూ. 553కు పెరిగిందని వివరించారు. ఇక ప్రతి 15 రోజులకు లేదా ఒక నెలకు.. ఈ ధరలపై సమీక్షిస్తామన్నారు. 2024, ఆగస్ట్ నుంచి ఇప్పటి వరకు 14.2 కిలోల సిలిండర్ ధరలు పెంచలేదని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఇక పెట్రోల్, డీజిల్ ధరలను సైతం కేంద్రం పెంచుతూ నిర్ణయం తీసుకుంది. లీటర్‌కు ఏకంగా రూ. 2 మేర పెంచింది. ఈ ధరలు సోమవారం అర్ధరాత్రి నుంచి అమల్లోకి

మిగతా 2వ పేజీలో...



# 24వ తేదీన

- కంచ గచ్చిబౌలి భూముల కేసు మళ్లీ విచారణ
- హెచ్‌సీయూ భూ వివాదం వాయిదా వేసిన హైకోర్టు
- ఆలోగా కౌంటర్ దాఖలుకు ప్రభుత్వానికి ఆదేశం
- ఫేక్ వీడియోలుగా పేర్కొంటున్న పోలీసులు
- బీఆర్ఎస్ నేత మన్నె క్రిశాంక్‌కు నోటీసులు
- ఈ నెల 9న విచారణకు రావాలని తాఖీదులు

**హైదరాబాద్- నీలగిరివార్త :** హెచ్‌సీయూ భూ వివాదంపై సోమవారం హైకోర్టులో ఈనెల 24వ తేదీకి వాయిదా వేసింది. ఈ అంశం సుప్రీంకోర్టు పరిధిలో ఉందని డివిజన్ బెంచ్ పేర్కొంది. ఈ కేసులో కౌంటర్, రిపోర్ట్ ఈనెల 24లోగా సమర్పించాలని న్యాయస్థానం ఆదేశించింది. హెచ్‌సీయూ భూముల వివాదంపై సుప్రీం కోర్టు, హైకోర్టులో విచారణ జరుగుతోంది. ఈ క్రమంలో హైకోర్టులో హెచ్‌సీయూ భూములపై విచారణ జరుగగా.. పలు అంశాలను కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. సుప్రీం కోర్టులో కేసు విచారణ దశలో ఉన్నందున ఈనెల 24కు వాయిదా వేస్తూ తెలంగాణ హైకోర్టు నిర్ణయం తీసుకుంది. 24 లోపు రాష్ట్ర ప్రభుత్వం, పోలీసులు కౌంటర్ దాఖలు చేయాలని న్యాయస్థానం ఆదేశించారు. అలాగే స్టేటస్ రిపోర్టు ఫైల్ చేసేలా ప్రభుత్వానికి ఆదేశాలు ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వం తరపున న్యాయవాది తన వాదనలు



వినిపించారు. దీంతో ఫేక్ వీడియో, ఫారెస్ట్ తగుల బెట్టిన వీడియోలపై ఇప్పటికే గచ్చిబౌలి పోలీసులు కేసు నమోదు చేశారు. వాటికి సంబంధించి ఇన్వెస్టిగేషన్ రిపోర్టుపై పోలీసులే కౌంటర్ దాఖలు చేస్తారని ప్రభుత్వం తరపు న్యాయవాది కోర్టు తెలిపడంతో తదుపరి విచారణ

మిగతా 2వ పేజీలో...

# ఫేక్ వీడియోలతో దుష్ప్రచారం

- కంచె గచ్చిబౌలి భూములపై హైకోర్టులో పిటిషన్
- హెచ్‌సియూ విద్యార్థులపై కేసుల ఉపసంహరణ
- పోలీసులను ఆదేశించిన డిప్యూటీ సిఎం భట్టి
- టీచర్స్ , సివిల్ సొసైటీ గ్రూప్స్‌తో మంత్రుల భేటీ



**హైదరాబాద్- నీలగిరివార్త :** కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారంపై తెలంగాణ ప్రభుత్వం హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. కృత్రిమమేధ సాయంతో నకిలీ వీడియోలు సృష్టించి ప్రచారం చేశారని పిటిషన్‌లో పేర్కొంది. ప్రభుత్వం తరఫున సుప్రీంకోర్టు న్యాయవాది మేనక గురుస్వామి వాదనలు వినిపించారు. మొత్తం 400 ఎకరాలకు సంబంధించిన నకిలీ వీడియోలు, ఆడియో క్లిప్పింగ్స్ తయారు చేశారని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. భూమిని చదును చేసే క్రమంలో బుల్డోజర్లను చూసి జింకలు, నెమళ్లు పారిపోతున్నట్లు నకిలీ వీడియోలు సృష్టించారని పిటిషన్‌లో పేర్కొంది. నకిలీ వీడియోలు సృష్టించిన వారిపై తగిన చర్యలు తీసుకునేలా ఆదేశించాలని ప్రభుత్వం న్యాయస్థానాన్ని కోరింది. పిటిషన్‌పై ఏప్రిల్ 24న వాదనలు వింటామని హైకోర్టు వెల్లడించింది. ఇదిలావుంటే హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థులపై నమోదు చేసిన కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పోలీసులను ఆదేశించారు. సోమవారం సచివాలయంలో హెచ్‌సీయూ టీచర్స్ అసోసియేషన్, సివిల్ సొసైటీ గ్రూప్స్‌తో, సబ్ కమిటీ సభ్యులైన మంత్రులు శ్రీధర్‌బాబు, పొంగులేటితో చర్చించిన అనంతరం భట్టి ఈ నిర్ణయం తీసుకున్నారు. జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్న ఇద్దరు విద్యార్థులకు సంబంధించి కేసుల ఉపసంహరణకు వెంటనే చర్యలు చేపట్టాలని సూచించారు. ఎలాంటి న్యాయపరమైన సమస్యలు ఉత్పన్నం కాకుండా పోలీస్

మిగతా 2వ పేజీలో...

## లక్ష ఎకరాలు డిఫారెస్ట్‌పై

# నోరు మెదపరేం

- పదివేల ఎకరాలు అమ్ముకుంటే ఏం చేశారు
- తెలంగాణకు రూపాయి సాయం కూడా చేయని బిజెపి
- దమ్ముంటే తెలంగాణకు సాయంపై వైట్ పేపర్ రిలీజ్ చేయండి
- బిజెపి, బిఆర్ఎస్ రెడూ ఒక్కగూటి పక్షులే
- కేంద్రమంత్రులు కిషన్ రెడ్డి, బండిల తీరు దారుణం
- పిసిసి చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ విమర్శలు

**హైదరాబాద్- నీలగిరివార్త :** కేంద్ర ప్రభుత్వం తెలంగాణ తీరని అన్యాయం చేస్తోందని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు. 11 ఏళ్లుగా ఎలాంటి సహాయసహకారాలు అందించడం లేదని అన్నారు. ఫెడరల్ వ్యవస్థను విస్మరించి తెలంగాణ పట్ల సవతితల్లి ప్రేమను చూపిస్తోందన్నారు. పదేళ్ల పాలనలో భారాస వేల ఎకరాలు అమ్ముకుంది. అప్పుడు ఎందుకు మాట్లాడలేదని అన్నారు. గత ప్రభుత్వ లక్ష ఎకరాలు డీఫారెస్ట్ చేస్తే ఎందుకు ప్రశ్నించలేదని నిలదీశారు. సోమవారం ఆయన గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడుతూ హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో 20వేల ఎకరాల ప్రభుత్వ భూములు కరిగి పోతే కిషన్ రెడ్డి ఎందుకు మాట్లాడలేదన్నారు. 10వేల ఎకరాల భూము లను కేసీఆర్, కేటి



ఆర్‌లు అమ్ముకుంటే కిషన్ రెడ్డి ఏమి చేసిండని అన్నారు. ఇప్పుడు 400

మిగతా 2వ పేజీలో...



# భద్రగిరికి రారాజు

## వైభవంగా రామయ్య పట్టాభిషేకం

**హైదరాబాద్- నీలగిరివార్త :** భద్రాచలంలో శ్రీరాముల వారి మహాపట్టాభిషేకం అంగరంగ వైభవంగా జరిగింది. మిథిలా కళ్యాణ మండపంలో సీతరామచంద్రుడికి అర్చకులు పట్టాభిషేకం నిర్వహించారు. ఆదివారం భద్రాచాలంలో శ్రీసీతారాముల కళ్యాణం అత్యంగ కన్నులపండుగా జరిగింది. ప్రతీఏటా స్వాముల వారి కళ్యాణం అనంతరం మహాపట్టాభిషేకాన్ని నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ హాజరయ్యారు. శ్రీ రామ మహా పట్టాభిషేకంలో రాముల వారికి పట్టు వస్త్రాలను గవర్నర్ సమర్పించారు. పట్టాభిషేకంలో భాగంగా రాములవారికి పాదుకలను సమర్పించారు అర్చకులు. రాజదండం, రాజ ముద్రిక, రాజ ఖడ్గం, ఛత్రం, చామరలు, రామదాసు పచ్చల పతకాన్ని శ్రీరాముడికి అలంకరించారు. ఆపై ఆ రామయ్యకు కిరీటం ధరించారు. ఆ తరువాత వివిధ నదుల తీర్థాలతో

మిగతా 2వ పేజీలో...



# మార్కెట్లో మండే మంటలు

- భారీగా నష్టపోయిన సూచీలు
- సెన్సెక్స్ 3వేలు, నిఫ్టీ వేయికి పైగా పాయింట్ల పతనం


**ముంబై- నీలగిరివార్త :** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు సోమవారం భారీ నష్టాల్లో ముగిశాయి. మండే మంటలతో భారీ నష్టాలను మూటగట్టుకున్నాయి. ఉదయం మిశ్రమంగా మొదలయిన సెన్సెక్స్, నిఫ్టీ స్వల్ప నష్టాల్లో ప్రారంభం కాగా, బ్యాంక్ నిఫ్టీ, బ్యాంకెక్స్, ఫిన్ నిఫ్టీ స్వల్ప లాభాలతో మొదలయ్యాయి. అయితే అమ్మకాల ఒత్తిడి నేపథ్యంలో నిమిషాల వ్యవధిలో మార్కెట్లు పతనం ప్రారంభమైంది. అదే కొనసాగి చివరికి భారీ స్థాయిలో ఇండెక్సులు కింద పడిపోయాయి. అంతర్జాతీయ మార్కెట్లన్నీ నష్టాలు నమోదు చేయగా మదుపర్లు అప్రమత్తంగా

మిగతా 2వ పేజీలో...

# అమరావతిలో మెగా హెల్త్ హబ్ ఏర్పాటు

- 200 ఎకరాల్లో ఏర్పాటుకు యత్నం
- ప్రతి నియోజకవర్గంలో వందపడకల ఆస్పత్రి
- ప్రజల హెల్త్ వివరాలతో డిజిటల్ కార్డులు
- జూన్ 15నకుప్పంలో ప్రారంభం
- హెల్త్‌పై సిఎం చంద్రబాబు వివరణ

**అమరావతి- నీలగిరివార్త :** అమరావతిలో మెగా హెల్త్ హబ్ ఏర్పాటు చేయబోతున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రకటించారు. రాజధాని అవసరాలతో పాటు,రాష్ట్ర వ్యాప్తంగా ఆస్పత్రులు నిర్మాణాలకు ప్రాధాన్యం ఇస్తామని అన్నారు. త్వరలోనే ఏపీ వ్యాప్తంగా ప్రజల డిజిటల్ హెల్త్ రికార్డులు రూపొందిస్తాం.. ప్రస్తుతం పైలట్‌గా డిజిటల్ హెల్త్ నర్వ్ సెంటర్ ను కుప్పంలో చేశాం.. త్వరలో చిత్తూరు జిల్లాలో చేయబోతున్నాం.. ఆ తర్వాత రాష్ట్ర వ్యాప్తంగా డిజిటల్ హెల్త్ రికార్డ్స్ తయారు చేస్తాం.. త్వరలో పిల్లల హెల్త్ రికార్డు లను కూడా డిజిటల్ లాకర్ లో పెడతాం.. ఏపీలో అందరికీ ఐడీ కార్డులు జారీ చేస్తామని స్పష్టం చేశారు. సోమవారం మీడియాతో సీఎం మాట్లాడుతూ.. ఏపీలో వైద్యం, ఆరోగ్యంపై చంద్రబాబు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. అలాగే ఏపీలో పెరిగిన వైద్య ఖర్చులు, వివిధ వ్యాధుల వివరాలు వెల్లడించారు. అమరావతిలో మెగా గ్లోబల్ మెడిసిటీ



ప్రాజెక్ట్ ఏర్పాటు చేయాలని భావిస్తున్నామని.. మొత్తం 200 ఎకరాలు ఇందుకు అవసరం అవుతాయన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇది ఏర్పాటు చేస్తుందన్నారు. అమరావతిలోని హెల్త్ సిటీలో ఏర్పాటు చేస్తామన్నారు. అతి త్వరలో దీనిపైన నిర్ణయం తీసుకుంటామని ముఖ్యమంత్రి వెల్లడించారు. ప్రతి నియోజకవర్గంలో 100 పడకల

మిగతా 2వ పేజీలో...

# నూతన ఎమ్మెల్సీ ప్రమాణస్వీకారం

## మరోరోజు ప్రమాణస్వీకారం చేయనున్న దాసోజు

**హైదరాబాద్- నీలగిరివార్త :** తెలంగాణ రాష్ట్ర శాసనమండలి వేదికగా నూతనంగా ఎన్నికైన ఎమ్మెల్సీలచేత సోమవారం మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి వారితో ప్రమాణస్వీకారం చేయించారు. శ్రీపాల్‌రెడ్డి, శంకర్ నాయక్, నెల్లికంటి సత్యం, మల్కా కొమురయ్య, అంజి రెడ్డి తదితరులు ప్రమాణం చేశారు. ఈ కార్యక్రమానికి మంత్రి శ్రీధర్‌బాబు, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, రాజ్యసభ సభ్యులు డా. లక్ష్మణ్, ఎంపీ రఘునందన్ రావు, ఎమ్మెల్సీ ఏవిన్ రెడ్డి, జానారెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి తదితరులు హాజరయ్యారు. అయితే బీఆర్ఎస్ పార్టీ నుంచి ఎమ్మెల్సీగా ఎన్నికైనా దాసోజు శ్రవణ్ మరోరోజు ప్రమాణ స్వీకారం చేస్తారని ఆ పార్టీ వర్గాలు తెలిపాయి. కాగా ఎమ్మెల్యే కోటాలో కాంగ్రెస్ నుంచి విజయశాంతి, అద్దంకి దయాకర్, శంకర్‌నాయక్, సీపీఐ నుంచి నెల్లికంటి సత్యం, బీఆర్ఎస్ నుంచి దాసోజు శ్రవణ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కరీంనగర్ పట్టభద్రులు, టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులు




అంజిరెడ్డి, మల్క కొమరయ్య విజయం సాధించారు. అలాగే ఖమ్మం టీచర్ ఎమ్మెల్సీ స్థానం నుంచి పీఆర్‌టీయూ అభ్యర్థి శ్రీపాల్‌రెడ్డి గెలిచారు. ఎమ్మెల్సీగా ప్రమాణం చేసిన అనంతరం బీజేపీ ఎమ్మెల్సీ అంజి రెడ్డి మాట్లాడుతూ కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి నాయకత్వంలో ఎమ్మెల్సీగా గెలిచినందుకు సంతోషంగా ఉందన్నారు. పార్టీ నాయకత్వానికి, గెలిపించిన ప్రతి కార్యకర్తలకు ధన్యవాదాలు తెలిపారు. హెచ్‌సీయూ భూములు అమ్మాలని ప్రభుత్వం

మిగతా 2వ పేజీలో...



# అసెంబ్లీలో పూలే విగ్రహం ఏర్పాటు

## నేడు ఇందిరాపార్క్ వద్ద కవిత దీక్ష

**హైదరాబాద్- నీలగిరివార్త :** అసెంబ్లీ ఆవరణలో మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత డిమాండ్ చేస్తూ వస్తున్నారు. ఈ మేరకు మంగళవారం నాడు ఇందిరాపార్క్ వద్ద దీక్ష చేపట్టనున్నారు. తెలంగాణ జాగృతి, యునైటెడ్ పూలే ఫ్రంట్ సంస్థలు సంయుక్తంగా నిర్వహించనున్న ఈ దీక్ష ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు కొనసాగుతుంది. ఈ నేపథ్యంలో ఇందిరా

మిగతా 2వ పేజీలో...



## దిల్‌సుఖ్ నగర్ పేలుళ్లపై నేడు తీర్పు

**హైదరాబాద్ - నీలగిరివార్త :** దిల్‌సుఖ్‌నగర్ బాంబు పేలుళ్ల కేసులో మంగళవారంతెలంగాణ హైకోర్టు తీర్పు ఇవ్వనుంది. 2013లో దిల్‌సుఖ్‌నగర్‌లో పేలుళ్లు చోటు చేసుకున్న విషయం తెలిసిందే. ఈ పేలుళ్లలో 18 మంది మృతి, 130 మందికి గాయాలు అయ్యాయి. ఈ విషాద ఘటన నగర ప్రజలను భయభ్రాంతులకు గురిచేసింది. 2016లో ఫాస్ట్‌ట్రాక్‌కోర్టు యాసిన్ భత్కల్ సహా ఐదుగురికి ఉరిశిక్ష విధించింది. అయితే కింది కోర్టు తీర్పుపై ముద్దాయిలు హైకోర్టును ఆశ్రయించారు. ప్రధాన నిందితుడు రియాజ్‌భత్కల్ ఇప్పటికి పరారీలో ఉన్నాడు. ఈ జంట పేలుళ్లకు ప్రధాన కారకుడైన యాసిన్ భత్కల్ అని పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

## హైదరాబాద్‌లో దేశంలోనే అతిపెద్ద ఫ్రూట్ మార్కెట్

**కొహెడలో 199.12 ఎకరాల్లో నిర్మించడానికి ప్రతిపాదనలు**

**హైదరాబాద్- నీలగిరివార్త :**
తెలంగాణ రాష్ట్రంలో పెరుగుతున్న ఉద్యాన పంటలను దృష్టిలో ఉంచుకుని, అలాగే భవిష్యత్తులో పండ్ల ఎగుమతి, దిగుమతులకు తగ్గట్లు.. అత్యాధునిక సౌకర్యాలతో, అంతర్జాతీయ స్థాయిలో దేశంలోనే అతిపెద్ద పండ్ల మార్కెట్‌ను నిర్మించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైంది. హైదరాబాద్ శివార్లలోని కొహెడలో రూ.1,901.17 కోట్లతో 199.12 ఎకరాల్లో అతిపెద్ద ఫ్రూట్ మార్కెట్ నిర్మించడానికి ప్రతిపాదనలు రెడీ అయ్యాయి. మార్కెటింగ్‌శాఖ డీటేయిల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్(డీపీఆర్)ను రూపొందించి రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించింది. సీఎం రేవంత్‌రెడ్డి ఆమోదం అనంతరం పనులు మొదలుకానున్నాయి. 1986లో హైదరాబాద్‌లోని కొత్తపేటలో 22 ఎకరాల్లో ఫ్రూట్ మార్కెట్ ఏర్పాటు చేశారు. రద్దీ సమస్య దృష్ట్యా దాన్ని 2021లో కొహెడకు తరలించారు. తాత్కాలిక షెడ్లను నిర్మించగా వర్షాలు, గాలికి కూలిపోయాయి. దీంతో మార్కెట్‌ను బాటసింగారం హెచ్‌ఎండీఏ లాజిస్టిక్ పార్కులోకి మార్చారు. ఇప్పుడు కొహెడలో ఏకంగా 199 ఎకరాల్లో మార్కెట్ నిర్మాణానికి ప్రభుత్వం నడుంబిగించింది. ప్రస్తుతం ఢిల్లీలో 100 ఎకరాల్లో దేశంలోనే అతిపెద్ద పండ్ల మార్కెట్ ఉంది. కొహెడలో మార్కెట్ నిర్మాణం పూర్తి అయితే.. ఢిల్లీని మించి దేశంలోనే అతి పెద్ద ఫ్రూట్ మార్కెట్‌గా హైదరాబాద్ నిలుస్తుంది. 48.71 ఎకరాల్లో పండ్ల వ్యాపారానికి అవసరమైన మౌలిక వసతులను నిర్మిస్తారు. రోడ్ల కోసం 56.05 ఎకరాలు కేటాయించారు. టోల్‌గేట్, నాలా, గ్రామరోడ్డు వంటివాటికి 17.27 ఎకరాలు, పార్కింగ్ స్థలానికి 16.59 ఎకరాలు కేటాయిస్తారు. పూలు, డ్రైఫ్రూట్స్, పాడి, చేపలు, పౌల్ట్రీ, మాంసం, ఫ్రోజెన్, ప్యాక్డ్ బాటిల్ ఫుడ్స్ వంటి ఉత్పత్తులకు 10.98, కోల్డ్‌స్టోరేజీలకు 9.50 ఎకరాలు కేటాయించనున్నారు. వీటితో పాటు.. పండ్ల రిటైల్ జోన్, సామగ్రి నిల్వ, ప్రాథమిక శుద్ధి, వివిధ ట్రీట్‌మెంట్ ప్లాంట్లు, పరిపాలన భవనం, ప్రయోగ శాలలు, విశ్రాంతిగృహాలు, అగ్నిమాపక, పోలీసుస్టేషన్, ఆరోగ్యకేంద్రం, దుకాణాల సముదాయం, ఘనవ్యర్థాల నిర్వహణ, విద్యుత్ సబ్‌స్టేషన్ వంటి నిర్మాణాలు చేపడతారు. వంద అడుగుల ఎత్తులో 19,375 చదరపు అడుగుల స్థలంలో నిర్మించే టవర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. ఇందులో 4 అంతస్తులను వ్యాపార సంస్థలకు కేటాయిస్తారు. ఆరు హై-స్పీడ్ ప్యాసింజర్ లిఫ్ట్‌లు, హెలిప్యాడ్‌లు ఉంటాయి. రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ వాణిజ్య, ఎగుమతి సంస్థలకు లీజుపై స్థలాలను కేటాయించనున్నారు. రూ.350 కోట్లను భూసేకరణకు వెచ్చిస్తున్నారు. రూ.1,694.74 కోట్లతో నిర్మాణ పనులు, ఐటీ సౌకర్యాలు కల్పిస్తారు.

## యువతిపై అత్యాచారయత్నం

**ప్రతిఘటించి తప్పించుకున్న యువతి**

**హైదరాబాద్- నీలగిరివార్త :** నగరంలో రోజురోజుకూ అమ్మాయిలపై అఘాయిత్యాలు పెరిగిపోతున్నాయి. బయటకు వెళ్లిన వారు జాగ్రత్తగా ఇంటికి ఇస్తారా అనే సందేహం తల్లిదండ్రుల్లో తీవ్ర భయాందోళలను కలిగిస్తోంది. ఈనేపథ్యంలోనే మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో దుండగులు యువతిపై అత్యాచారయత్నానికి పాల్పడ్డారు. కానీ యువతి మాత్రం భయపడిపోకుండా తనను తాను రక్షించుకునేందుకు కీచకులతో పోరాడింది. అయితే యువతి కూడా ఎక్కడా తగ్గకుండా వారితో ధైర్యంగా పోరాడింది. కామాంధుల నుంచి తనను తాను కాపాడుకునేందుకు తీవ్రంగా ప్రయత్నించింది. ఒక్కసారిగా దుండగులు మీదకు రావడంతో వారిని అడ్డుకునేందుకు అక్కడే ఉన్న రాళ్లతో దాడి చేసి తప్పించునేందుకు ప్రయత్నించింది. చివరకు ఆ దుండగుల భారి నుంచి ఎలాగోలా తప్పించుకుని వెంటనే మేడ్చల్ పోలీస్‌స్టేషన్‌కు చేరుకుంది. యువతి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ మధ్య కాలంలో రైల్వేస్టేషన్ సమీప ప్రాంతాల్లో అసాంఘిక కార్యకలాపాలు చోటు చేసుకుంటున్నాయంటూ పలు ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. ఇలాంటి నేపథ్యంలో రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతాల్లో భద్రత పెంచాలంటూ పలు డిమాండ్‌లు వ్యక్తమవుతున్నాయి.

## అవును నేను కుక్కనే...

**కడియం వ్యాఖ్యలపై మండిపడ్డ పల్లా**

**జనగామ- నీలగిరివార్త :** అవును నేను కుక్కనే.. నన్ను నమ్మిన కేసీఆర్‌కు విశ్వాసమైన కుక్కలా ఉంటానని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి తెలిపారు. అంతేకానీ ఒక పార్టీలో గెలిచి అధికారం కోసం మరో పార్టీలోకి దుంకే నీలాంటి గుంట నక్కను మాత్రం కాదని మాజీమంత్రి కడియం శ్రీహరికి స్పష్టంచేశారు. స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి వ్యాఖ్యలపై జనగామ బీఆర్ఎస్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి కౌంటరిచ్చారు. బీఆర్ఎస్ పార్టీ దయతో గెలిచి కాంగ్రెస్ పార్టీలో చేరిన ఓ గుంట నక్క.. తనను బొచ్చు కుక్క అని విమర్శిస్తోందని అన్నారు. అవును నేను కుక్కనే.. నన్ను నమ్మిన కేసీఆర్‌కు విశ్వాసమైన కుక్కలా ఉంటా.. కానీ ఒక పార్టీలో గెలిచి అధికారం కోసం మరో పార్టీలోకి దుంకే నీలాంటి గుంటనక్కను మాత్రం కాను అంటూ సె-టైర్ వేశారు. బీఆర్ఎస్ రజతోత్సవాల్లో భాగంగా ఈ నెల 27వ తేదీన ఎల్కతుర్తిలో భారీ బహిరంగ సభ ఏర్పాటు చేయనున్న నేపథ్యంలో జనగామ జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరైన ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి.. మండల పార్టీ నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశర చేశారు.

## ఉపాధ్యాయుడి ప్రాణాలు తీసిన ధూమపానం

**కోదాడ- నీలగిరివార్త :** ధూమపానం ఓ ఉపాధ్యాయుడి ప్రాణాలు హరించింది. మద్యం మత్తులో సిగరెట్ వెలిగించిన ఓ ఉపాధ్యాయుడు దానిని ఆర్పివే-యకుండా అలాగే నిద్రలోకి జారుకున్నాడు. దీంతో సిగరెట్ వల్ల మంటలు చెలరేగి ఆ ఉపాధ్యాయుడి సజీవ దహనమయ్యాడు. ఈ ఘటన సూర్యాపేట జిల్లా కోదాడ మండలంలో చోటుచేసుకున్నది. పోలీసుల వివరాల ప్రకారం.. మండలంలోని మంగలి తండాకు చెందిన ధరావత్ బాలాజీ (52) నడిగూడెం మండలం చెన్నకేశవాపురం ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్నారు. శ్రీరామ నవమి సందర్భంగా ఆయన భార్య ఇద్దరు పిల్లలను తీసుకుని పుట్టింటికి వెళ్లారు. ఇంట్లో ఒక్కడే ఉండడంతో మద్యం సేవించారు. సిగరెట్ తాగుతూ మంచంపై ఆరుబయట మంచంపై పడుకున్నారు. మత్తులో నిద్రలోకి జారుకోవడంతో సిగరెట్ మంచం నవారుపై పడి మంటలు చెలరేగాయి. దానికి కూలర్ గాలి తోడవడంతో భారీగా ఎగసిపడ్డాయి. చుట్టుపక్కల ఎవరూ లేకపోవడం, బాలాజీ మద్యం మత్తులో ఉండటంతో శరీరానికి మంటలు అంటుకుని అక్కడికక్కడే మృతిచెందారు. బాలాజీ భార్య శైలజ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్ఐ ఎం.అనిల్‌రెడ్డి తెలిపారు.

# సింగపూర్‌తో కలసి పనిచేస్తాం

- ఫ్యూచర్ సిటీ, స్కిల్ వర్సిటీల ఏర్పాటు
- సింగపూర్ ప్రతినిధి బృందంతో మంత్రి శ్రీధర్ బాబు



**హైదరాబాద్ - నీలగిరివార్త :** ఫ్యూచర్ సిటీ, యంగ్ ఇండియన్ స్కిల్ యూనివర్సిటీల ఏర్పాటు లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం అడుగులు వేస్తోందని ఐటీ పరిశ్రమలశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. ఇందుకోసం శరవేగంగా ముందుకు సాగుతున్నామని అన్నారు. ఎమర్జింగ్ టెక్నాలజీస్ కు హబ్‌గా తెలంగాణను మార్చేందుకు చర్యలు చేపట్టామని అన్నారు. ఈక్రమంలో తెలంగాణ నుంచి రెండు లక్షల మంది ఏఐ ఇంజనీర్లను తయారు చేయాలన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమని మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. కాన్సులేట్ జనరల్ ఆఫ్ సింగపూర్ ఎడ్గర్ పాంగ్ నేతృత్వంలో ఆ దేశ ప్రతినిధుల బృందం సోమవారం సచివాలయంలో మంత్రి శ్రీధర్ బాబును మర్యాద పూర్వకంగా కలిసింది. 'ఎమర్జింగ్ టెక్నాలజీస్' కు హబ్‌గా తెలంగాణను మార్చేందుకు తీసుకుంటున్న చర్యలను ఈ సందర్భంగా శ్రీధర్ బాబు వారికి వివరించారు. ఈ రంగంలో ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకునేలా తెలంగాణ యువతను తీర్చి దిద్దుతామని అన్నారు. టెక్నాలజీ, స్కిల్ డెవలప్‌మెంట్, ఇతర అంశాల్లో సింగపూర్ ప్రభుత్వంతో కలిసి పనిచేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. అంతర్జాతీయ ప్రమాణాలతో నెలకొల్పుతున్న ఫ్యూచర్ సిటీ, యంగ్‌ఇండియా స్కిల్ యూనివర్సిటీ గురించి వివరించారు. ఫ్యూచర్ సిటీలో భాగస్వామ్యమయ్యేందుకు అనేక అంతర్జాతీయ సంస్థలు ముందుకొచ్చాయని అన్నారు. గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ హబ్‌గా హైదరాబాద్ మారుతుంది. ఏడాది వ్యవధిలోనే ఐటీ, హాస్పిటాలిటీ, ఇతర రంగాలకు చెందిన 70 జీసీసీలు ప్రారంభమయ్యాయి. రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధికి అన్ని చర్యలు తీసుకుంటున్నాం అని ఈ సందర్భంగా వారికి వివరించారు. పరిశ్రమల ఏర్పాటును ఒక్క హైదరాబాద్‌కే పరిమితం చేయకుండా.. వరంగల్, కరీంనగర్ లాంటి నగరాలకు విస్తరించేలా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహిస్తున్నాం అని శ్రీధర్‌బాబు వివరించారు.

# రూ.50 ఎక్కింది!

మొదటిపేజీ తరువాయి..

వస్తాయని స్పష్టం చేసింది. అయితే పెరిగిన ఈ పెట్రోల్, డీజిల్ ధరలు.. వాహనదారులపై పడవని కేంద్రం స్పష్టంగా పేర్కొంది. ఆ యా ధరలు ఆయిల్ కంపెనీలపై పడుతోందని వివరించింది. కేంద్రం పెట్రోల్, డీజిల్‌పై ఎక్సైజ్ జ్ సుంకాన్ని ఒక్కొక్కటి రూ. 2 చొప్పున పెంచుతున్నట్లు ప్రకటించింది. దీనికి సంబంధించి గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ నిర్ణయం భారతదేశంలోని ప్రధాన చమురు మార్కెటింగ్ కంపెనీల షేర్ ధరలలో గణనీయమైన తగ్గుదలకు దారితీసింది. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ , భారత్ పెట్రోలియం కార్పొరేషన్ ,హిందుస్తాన్ పెట్రోలియం కార్పొరేషన్ , దేశవ్యాప్తంగా పెట్రోలియం ఉత్పత్తుల రిటైల్ మార్కెటింగ్, పంపిణీకి ప్రధాన భూమిక వహిస్తాయి. ఈ ప్రకటన తర్వాత, ఆయా ఆయిల్ కంపెనీల స్టాక్ ధరలు భారీగా తగ్గాయి. పెట్రోల్‌పై సుంకాన్ని లీటరుకు రూ. 13 కు పెంచుతామని, డీజిల్‌పై లీటరుకు రూ. 10 కు పెంచుతామని ప్రభుత్వం ప్రకటించింది. పెరుగుదల లాభదాయకతపై ప్రభావం చూపుతుందని పెట్టు-బడిదారులు భావిస్తున్నారు. ఎందుకంటే అధిక సుంకాలు సాధారణంగా వినియోగదారుల ఖర్చులను పెంచుతాయి. అదే సమయంలో డిమాండ్‌ను తగ్గించే అవకాశం ఉంది. ఈ చర్య స్టాక్ మార్కెట్‌లో మరింత అస్థిరతకు దారితీస్తుందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ముఖ్యంగా పెట్రోలియం రంగంలో ప్రత్యక్షంగా పాల్గొన్న కంపెనీలకు. సుంకం పెంపు అంటే వినియోగదారులకు అధిక ఖర్చులు, ఇది ఇంధన డిమాండ్ తగ్గడానికి దారితీస్తుంది. ఇది ఇఈర, ఐఈర మరియు ఒక్షఈ వంటి చమురు మార్కెటింగ్ కంపెనీల లాభదాయకతను ప్రభావితం చేస్తుంది. అందుకనే ఆయా కంపెనీల షేర్ ధరలు పడిపోయాయి.

# ఫేక్ వీడియోలతో దుష్ప్రచారం

మొదటిపేజీ తరువాయి..

అధికారులకు తగు సూచనలు చేయాల్సిందిగా న్యాయశాఖ అధికారులను డిప్యూటీ సీఎం ఆదేశించారు. కొన్ని రోజులుగా కంచ గచ్చిబౌలి భూ వివాదంపై విమర్శలు చెలరేగుతున్న తరుణంలో తెలంగాణ సచివాలయంలో కీలక సమావేశం జరిగింది. మంత్రుల కమిటీతో ఉపాధ్యాయ సంఘం, పౌర సమాజ ప్రతినిధులు భేటీ అయ్యారు. మంత్రుల కమిటీలో మంత్రులు మల్లు భట్టి విక్రమార్క, శ్రీనివాస్ రెడ్డి, శ్రీధర్ బాబు, మీనాక్షి నటరాజన్ , వంశీ చంద్ రెడ్డి ఉన్నారు. క్యాంపస్‌లో పోలీసుల ఉపసంహరణ, నిషేధాజ్ఞల తొలగింపు చేయాలని ఈ సందర్భంగా ప్రతినిధుల సంఘం డిమాండ్ చేశారు. నిరసనలకు సంబంధించి పెట్టిన కేసులు ఉపసంహరించాలని, కస్టడీలో ఉన్న విద్యార్థులను విడుదల చేయాలని పౌర సంఘాలు డిమాండ్ చేశాయి. 400 ఎకరాల్లో నష్టం అంచనా, జీవవైవిధ్య సర్వేకు అనుమతి కోరుతూ విజ్ఞప్తి చేశారు. అయితే, సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం భూమిలో పోలీసుల బందోబస్తు కొనసాగుతుందని ఈ సందర్భంగా ప్రతినిధులకు మంత్రుల బృందం తెలిపింది. క్యాంపస్ నుంచి పోలీస్‌లను వెనక్కు తీసుకునే ప్రక్రియపై యూనివర్సిటీతో సంప్రదింపులు జరుపుతామని చెప్పారు. విద్యార్థుల కేసుల విషయం సానుభూతితో సమీక్షిస్తామని మంత్రులు బృందం హామీ ఇచ్చారు. అయితే, కోర్టు ఆదేశాల కారణంగా సర్వేకు అనుమతి ఇవ్వలేమని తేల్చి చెప్పారు. పరిస్థితులు అనుకూలిస్తే క్యాంపస్ సందర్శనకు సిద్ధమని మంత్రుల కమిటీ- ప్రతినిధుల బృందానికి తెలియచేసింది. సచివాలయంలో సమావేశం అనంతరం ఈ మేరకు కొన్ని కీలక నిర్ణయాలు తీసుకున్నారు. విద్యార్థులపై కేసుల ఉపసంహరణకు వెంటనే చర్యలు తీసుకోవాలని, దీంతో పాటు జ్యుడిషియల్ రిమాండ్‌లో ఉన్న ఇద్దరు విద్యార్థులపై కేసుల వాపసుకు ఆదేశాలిచ్చారు.

# లక్ష ఎకరాలు డిఫారెస్ట్‌పై నోరు మెదపరేం

మొదటిపేజీ తరువాయి..

ఎకరాల గురించి మాట్లాడే బీజేపీ నాయకులు.. ఆనాడు లక్షల ఎకరాలు గత ప్రభుత్వం డి ఫారెస్ట్ చేస్తే.. కిషన్ రెడ్డి ఆనాడు ఎందుకు నోరు మెదపలేదన్నారు. నిధుల విడుదలలో చేస్తున్న అన్యాయానికి గాను కేంద్రంపై ఫైరయ్యారు. గత పదకొండేళ్లలో మోదీ సర్కారు తెలంగాణకు ఇచ్చింది సున్న అంటూ మండిపడ్డారు. ఇటీవల కేంద్రం ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో తెలంగాణకు అన్యాయం జరిగిందన్నారు. మోదీ ప్రభుత్వం ఫెడరల్, రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా ఉందని మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు. డీలిమిటేషన్ జరిగితే దక్షిణాదికి తీవ్ర అన్యాయం జరుగుతుందని.. డీలిమిటేషన్ జరగకుండా ఉండేందుకు కోదండరాంతో కలసి నడుస్తామని ఆయన అన్నారు. భాజపా నేతలు తెలంగాణకు ఏం చేశారో చెప్పాలని తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ ప్రశ్నించారు. లోక్‌సభ ఎన్నికల్లో భాజపా 8 స్థానాల్లో గెలిస్తే.. కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణ రాష్ట్రానికి ఇచ్చిన నిధులు మాత్రం సున్నా.. అని విమర్శించారు. దేశంలో రెండో స్థానంలో ఉన్న హైదరాబాద్ మెట్రో తొమ్మిదో స్థానానికి పడిపోయింది. మెట్రోకు నిధులు అడిగితే ఇవ్వడం లేదు. మూసీ పునరుజ్జీవానికి నిధులు అడిగితే రూపాయి ఇవ్వలేదు. విభజన చట్టంలోని హామీల గురించి కేంద్ర మంత్రులు ఏనాడైనా మాట్లాడారా? మతతత్వ రాజకీయాలను తెలంగాణ ప్రజలు సహించరు. బీసీలకు 42శాతం రిజర్వేషన్లను ఆమోదించేందుకు కేంద్రాన్ని ఎందుకు అడగటం లేదని అన్నారు. గుజరాత్‌లో ముస్లింలకు రిజర్వేషన్ కల్పించడం లేదా అన్నారు. తెలంగాణ ప్రాజెక్టుల గురించి భాజపా నేతలు ఒక్కసారి కూడా మాట్లాడలేదు. తెలంగాణ పట్ల కేంద్ర ప్రభుత్వానిది సవతితల్లి ప్రేమను బిజెపి ఎందుకు ప్రశ్నించడం లేదన్నారు. భారాస, భాజపా మధ్య ఎప్పుడూ రహస్య బంధం ఉంటుందన్నారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ లపై తీవ్ర విమర్శలు గుప్పించారు. కేంద్ర మంత్రి బండిది అమిత్ షాకు చెప్పులు తొడిగిన చరిత్ర.. 11ఏండ్లు తెలంగాణకు ఏమి తెచ్చారో కిషన్ రెడ్డి, బండి సంజయ్ లు వైట్ పేపర్ రిలీజ్ చేయండి. చర్చకు సిద్ధమా? అంటూ సవాల్ విసిరారు. మోడీ, అమిత్ షాలు ఆర్డర్ వేస్తేనే కిషన్ రెడ్డి, బండి సంజయ్ లు పని చేస్తారు. కిషన్ రెడ్డి ఒక్క చాన్స్ కావాలని ప్రాధేయపడుతుండు.. తెలంగాణకు ఏమి ఎలగబెట్టారని ఒక్క చాన్స్ అని అడుగుతున్నారు.. మూడుసార్లు మోడీని ప్రధానిని చేస్తే రాష్ట్రానికి ఏమి ఎలగబెట్టారు.. తెలంగాణ ప్రజలు కిషన్ రెడ్డికి ఎమ్మెల్యేగా, ఎంపీగా, కేంద్ర మంత్రిగా అవకాశం ఇస్తే ఏమి చేశారు. మూడోసారి కూడా మతం పేరున ఓట్లు అడిగి అధికారంలోకి వచ్చారు.. మెట్రో కోసం ఒక్క రూపాయి తెచ్చిన పాపాన పోలేదన్నారు. మూసి ప్రక్షాళన జరిగి హైదరాబాద్ ప్రజలు బాగుపడటం కిషన్ రెడ్డికి నచ్చదు.. మతతత్వ రాజకీయాలు తెలంగాణ ప్రజలకు నచ్చదు.. అందుకే మీకు ప్రజలు చాన్స్ ఇవ్వరు.. తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావడం కల్ల.. విభజన హామీలు కిషన్ రెడ్డికి, బండి సంజయ్ కి పట్టదు ..అయినా కిషన్ రెడ్డి, బండి సంజయ్ లు పగటి కలలు కంటున్నారు.. కేంద్రం తెలంగాణపై సవతి తల్లి ప్రేమ చూపిస్తున్న కూడా పేదల సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ పని చేస్తోందని మండిపడ్డారు. కేంద్రం సవతి తల్లి ప్రేమ చూపించినా ఇచ్చిన హామీలు అమలు చేస్తున్నం.. పేద వాళ్లకు సన్న బియ్యం ఇస్తున్నం.. మీరు.. మీ బీజేపీ తెలంగాణాకీ ఏం చేసిందో... వైట్ పేపర్ రిలీజ్ చేయాలి.. ఏఐసీసీ నడుపుతుందని మాట్లాడుతున్నారు.. అమిత్‌షా, మోదీ పర్మిషన్ లేనిదే బ్రేక్ ఫాస్ట్ కూడా చేయరు.. అమిత్ షా మోదీ చెప్పులు మోయలేదా.. సన్నబియ్యం మేమే ఇస్తున్నాం అని బీజేపీ నాయకులు చెప్తున్నారు.. సన్న బియ్యం కార్యక్రమం బీజేపీ పాలిత అన్నీ రాష్ట్రాల్లో అమలు చేయండి.. బీజేపీకి వితండవాదం అలవాటైందని మహేష్ కుమార్ గౌడ్ విరుచుకుపడ్డారు.

# అమరావతిలో మెగా హెల్త్ హబ్ ఏర్పాటు


మొదటిపేజీ తరువాయి..

ఆసుపత్రులు ఏర్పాటు చేయబోతున్నామని చెప్పారు. 19,264 కోట్లు వైద్యారోగ్యశాఖలో ఖర్చు చేస్తున్నామని ఆశించిన ఫలితాలు మాత్రం రావడంలేదన్నారు. ఆసుపత్రుల్లో రూమ్ ఛార్జీలు ఎక్కువ అవుతున్నాయని.. అందుకే ఓ వినూత్నమైన ప్రయోగం చేస్తున్నామని చెప్పారు. అన్ని నియోజకవర్గాల్లో 100 - 300 పడకల ఆస్పత్రుల ఏర్పాటుకు నిర్ణయం తీసుకున్నామన్నారు. కోనసీమ, కాకినాడ, ఎన్టీఆర్ జిల్లాల్లో గుండె సంబంధిత ఇబ్బందులు ఎక్కువయ్యాయన్నారు. గుంటూరు, ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల్లో డయాబెటీ-స్ ఎక్కువగా ఉందన్నారు. ప్రకాశం, కర్నూలు అనంతపురంలో రెస్పిరేటరి సంబంధిత వ్యాధులు వ్యాప్తి జరుగుతోందని సీఎం అన్నారు. ఎస్సీడీ సర్వే 2.0 జరిగిందని.. ఇప్పుడు 3.0 జరుగుతోందన్నారు. ఐదేళ్లలో ఆసుపత్రులకు వచ్చిన డేటా ఆధారంగా ఏ జిల్లాల్లో ఏ వ్యాధి ఎక్కువ అనే లిస్ట్ సిద్ధం చేశామన్నారు. 8 లక్షల మంది బీపీ, షుగర్ బాధితులు చికిత్స తీసుకోవడం లేదన్నారు. షుగర్ వ్యాధి స్త్రీలు, పురుషులకు సమానంగా వస్తోందని తెలిపారు. ఆహారపు అలవాట్ల వల్లే షుగర్ ఎక్కువగా వస్తోందన్నారు. ఆడవాళ్లలో గుండె సబంధిత వ్యాధులు తక్కువ వస్తున్నాయని తెలిపారు. క్యాన్సర్ విషయంలో ఆడవాళ్లు ఎక్కువగా బాధపడుతున్నారన్నారు. బ్రెస్ట్ క్యాన్సర్‌తో ఎక్కువగా ఇబ్బంది పడుతున్నారన్నారు. లివర్ సంబంధిత వ్యాధులు మగవారికి ఎక్కువగా వస్తున్నాయని.. దీనికి కారణం లిక్కర్ అని అన్నారు. న్యూరలాజికల్ ఇష్యూలు మిడిల్ ఏజ్‌లో ఎక్కువ వస్తున్నాయని చెప్పారు. మగవారికి హైపర్ టెన్షన్ తక్కువ అని.. ఆడవాళ్లకు ఎక్కువన్నారు. మహిళలు ఎక్కువ స్ట్రెస్ తీసుకుంటు-న్నార అన్నారు. ఎక్కడ రైస్ ఎక్కువ తింటారో అక్కడ డయాబెటిక్ ఉందన్నారు. వెనుకబడిన జిల్లాల్లో డయాబెటిక్ తక్కువగా ఉందని తెలిపారు. ఏపీలో మన్యం జిల్లాలో వ్యాధులు తక్కువగా ఉన్నాయని.. మంచి వాతావరణం, సాంప్రదాయ ఆహారం అందుకు కారణమని చెప్పుకొచ్చారు. టాప్ టెన్ డిసీజెస్ కంట్రోల్‌కు ప్రపంచం ఏం చేస్తుందో చూశామన్నారు. ఇటీవలే ఏఐతో కూడిన న్యూట్రిషనల్ యాప్ తయారు చేశామని.. యాప్‌కు స్కోచ్ అవార్డు కూడా వచ్చిందని తలెపారు. ఇప్పటి వరకు 4 లక్షల మంది డౌన్‌లోడ్ చేసుకుని వినియోగిస్తున్నారన్నారు. పొగాకు, ఆల్కహాల్, డ్రగ్స్ దూరంగా ఉంటే మంచిదన్నారు. మిల్లెట్స్, బ్రౌన్ రైస్ ఎక్కువగా అలవాటు చేసుకోవాలని తెలిపారు. పంజాబ్ క్యాన్సర్ క్యాపిటల్ అయిందని.. దీని కౌంటర్ కోసం నేచురల్ ఫార్మింగ్ చేస్తున్నామన్నారు. ఫుడ్ యాజ్ ఏ మెడిసిన్.. కిచెన్ యాజ్ ఏ ఫార్మసీ అని.. దీని వల్ల ప్రభుత్వ బడ్జెట్ కూడా తగ్గుతుందన్నారు. స్కూల్ ఎడ్యుకేషన్ నుంచే పిల్లలకు ఫుడ్ హ్యాబిట్స్‌పై అవగాహన కల్పించాలని సూచించారు. కుప్పంలో డిజిటల్ నర్వ్ సెంటర్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. మానిటరింగ్, అలెర్ట్‌లు ఎప్పటికప్పుడు ఇచ్చేలా ప్రయత్నం చేస్తున్నామని చెప్పారు. అత్యవసర పరిస్థితుల్లో మొబైల్ వాహనం ఇళ్ల వద్దకే వెళ్లి వైద్య పరీక్షలు చేస్తుందన్నారు సీఎం చంద్రబాబు.. మొత్తం 27 పరీక్షలు మొబైల్ వ్యాన్ ద్వారా నిర్వహించేందుకు ఇప్పటికే కార్యాచరణ సిద్ధం చేశాం.. ఈ వ్యవస్థల రూపకల్పనకు టాటా సంస్థతో పాటు, బిల్ గేట్స్ ఫౌండేషన్, ఏపీ మెడ్ టెక్ పార్క్ సహకరిస్తాయన్నారు. రాష్ట్రంలో ప్రభావితం చేస్తున్న 10 ఆరోగ్య సమస్యలపై ప్రత్యేక అధికారులను నియమిస్తాం.. క్యాన్సర్ కు ఇప్పటికే డాక్టర్ నోరి దత్తాత్రే-యుడును నియమించాం.. హెల్తీ వెల్తీ హ్యాపీ ఏపి మా ప్రభుత్వ లక్ష్యంగా పెట్టుకున్నాం.. అన్నారు.

# మద్యం అమ్మకాల జోరు

**భారీగా పెరిగిన తెలంగాణ ఆదాయం**

**హైదరాబాద్- నీలగిరివార్త :** తెలంగాణలో మద్యం అమ్మకాల జోరుతో ఆబ్కారీ శాఖకు భారీగా ఆదాయం సమకూరింది. గత సంవత్సరంతో పోలిస్తే ఏడు శాతం మద్యం అమ్మకాలు పెరిగినట్లుగా అధికారులు వెల్లడించారు. 2024-25లో శాఖకు 34,600 కోట్లు ఆదాయం వచ్చినట్లు తెలిపారు. కొత్త మద్యం దుకాణాల కోసం ధరఖాస్తుల రూపంలో ఆదాయం రూ. 264.50 కోట్లు వచ్చిందని తెలిపారు. 2024-25 సంవత్సరంలో పన్నుల రూపంలో రూ. 7000 కోట్ల సొమ్ము వచ్చిందని వెల్లడించారు. 2024-25లో సంవత్సరంలో 531 లక్షల కేసుల బీర్ల అమ్మకాలు జరిగాయి. గత సంవత్సరంతో పోలిస్తే బీర్ల అమ్మకాల్లో 3 శాతం తగ్గుదల కనిపించిందని తెలిపారు. బీర్ల కంపెనీలు 15 రోజుల పాటు- సరపరా నిలిపి వేయడంతో తగ్గుదల కనిపించింది. బీర్ల ధరలు పెంచడంతో బీర్ల అమ్మకాలు కొద్దిమేర తగ్గిపోయాయి. 2024-25 అర్థిక సంవత్సరంలో 2 శాతం లిక్కర్ సెల్స్ పెరిగాయి. గతంతో పోలిస్తే ప్రతి సంవత్సరంలాగ తెలంగాణలో మద్యం అమ్మకాల్లో పెరుగుదల కనిపించిందని అధికారులు తెలిపారు.





## సిఎం రేవంత్‌తో సింగపూర్ కాన్సుల్ జనరల్ భేటీ

**హైదరాబాద్- నీలగిరివార్త :** జూబ్లీహిల్స్ నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని చెన్నైలోని సింగపూర్ కాన్సుల్ జనరల్ ఎడ్గార్ పాంగ్ మర్యాదపూర్వకంగా కలిసారు. వీరితో పాటు ఐటి సెక్రటరీ జయేశ్రంజన్ తదితరులు కూడా ఉన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో ఫ్యూచర్ సిటీ, స్కిల్ వర్సిటీ తదితర అంశాలను సిఎం ప్రస్తావించారు.

## 24వ తేదీన

మొదటిపేజీ తరువాయి..

24కు వాయిదా వేసింది హైకోర్టు. మరోవైపు కంచ గచ్చిబౌలి భూములపై ఏఐని ఉపయోగించి కొన్ని సోషల్ మీడియాలో సర్క్యులేట్ చేయడంపై గచ్చిబౌలి పోలీసులు కేసులు నమోదు చేశారు. అందులో భాగంగా బీఆర్ఎస్ నేత మన్నె క్రిశాంక్‌కు పోలీసులు నోటీసులు ఇచ్చారు. కంచ గచ్చిబౌలి భూముల్లో ఏఐ ఉపయోగించి సోషల్ మీడియాలో పోస్ట్ చేసినందుకు క్రిశాంక్‌కు పోలీసులు నోటీసులు అందజేశారు. ఈనెల 9,10, 11న గచ్చిబౌలి పోలీస్ స్టేషన్‌కు విచారణకు రావాలని నోటీసుల్లో పేర్కొన్నారు.

## భద్రగిరికి రారాజు

మొదటిపేజీ తరువాయి..

సీతారామచంద్రయ్య భగవనాడుకి అభిషేకం క్రతువును నిర్వహించారు అర్చకులు. మహా పట్టాభిషేక మహోత్సవానికి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఆ రామయ్య పట్టాభిషేకాన్ని వీక్షించి పునీతులయ్యారు. రాత్రికి రథోత్సవం నిర్వహించనున్నారు. ఈ మహోత్సవంలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మతో పాటు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కూడా పాల్గొన్నారు. భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామివారి బ్రహ్మోత్సవాల్లో శ్రీరామనవమి మహా పట్టాభిషేకం కార్యక్రమాలు ఘనంగా నిర్వహించామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. ఈ సంవత్సరం రాష్ట్రం, దేశం పాడి పంటలతో సుసంపన్నంగా ఉండాలని కోదండ రాముడుని వేడుకున్నానని తెలిపారు. రాముల వారి కళ్యాణం పట్టాభిషేకం ఘనంగా నిర్వహించిన అధికారులకు, విచ్చేసిన భక్తులకు, మీడియా ప్రతినిధులకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. కాగా.. రాముల వారి పట్టాభిషేక మహోత్సవంలో పాల్గొనేందుకు సోమవారం ఉదయం సారపాకకు చేరుకున్న గవర్నర్‌కు హెలిప్యాడ్ వద్ద మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్వాగతం పలికారు. ఆపై మిథిలా కళ్యాణ మండపానికి చేరుకున్న గవర్నర్‌కు ఆలయ మర్యాదలతో అర్చకులు, మంత్రి తుమ్మల స్వాగతం పలికారు.

## నూతన ఎమ్మెల్సీ ప్రమాణస్వీకారం

మొదటిపేజీ తరువాయి..

చూస్తోందని, విద్యార్థులపై లాఠీ ఛార్జ్ చేయడం దుర్మార్గమన్నారు. విద్యార్థులపై పెట్టిన కేసులు వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. బీజేపీ ఎమ్మెల్సీ మల్క కొమురయ్య మాట్లాడుతూ.. తనను గెలిపించిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా కృతజ్ఞతలు తెలుపుతున్నాన్నారు. రాష్ట్ర నాయకత్వానికి, కేంద్ర నాయకత్వానికి ప్రత్యేకమైన ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్రంలో విద్యా వ్యవస్థ సమస్యలపై పోరాటం చేస్తామని చెప్పారు.

## అసెంబ్లీలో పూలే విగ్రహం ఏర్పాటు

మొదటిపేజీ తరువాయి..

పార్క్ వద్ద ఏర్పాట్లను సోమవారం నాడు తెలంగాణ జాగృతి నాయకులు నవీన్ ఆచారి, యూపీఎఫ్ కో కన్వీనర్ బొల్ల శివ శంకర్ పరిశీలించారు. బీసీల ఆత్మ బంధువు అయిన మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహాన్ని అసెంబ్లీ ఆవరణలో ఏర్పాటు- చేయాలని డిమాండ్ చేస్తూ చాలాకాలం నుంచి ఎమ్మెల్సీ కవిత పోరాటం చేస్తున్న విషయం విదితమే. పలు సార్లు ధర్నాలు, దీక్షలు నిర్వహించడమే కాకుండా విగ్రహ ఏర్పాటు-ఆవశ్యకతపై పలు జిల్లాల్లో రౌండ్ టేబుల్ సమావేశాలు నిర్వహించారు. అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌ను రెండు సార్లు కలిసి వినతి పత్రాలు కూడా అందించారు. అయినప్పటికీ ప్రభుత్వంలో చలనం లేకపోవడంతో పోరాటాన్ని ఉధృతం చేశారు. విగ్రహ ఏర్పాటు-పై ఈ నెల 11న పూలే జయంతిలోగా స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేస్తున్నారు. కాగా, ఇందిరా పార్కు వద్ద ఏర్పాట్లను పరిశీలించిన అనంతరం బొల్ల శివ శంకర్ విలేకరులతో మాట్లాడుతూ.. బీసీల విషయంలో ప్రభుత్వం చిన్న చూపు తగదని సూచించారు. బీసీల ఆరాధ్య దైవమైన పూలే విగ్రహాన్ని చట్టసభల ఆవరణలో ఏర్పాటు-చేసి గౌరవించాలని డిమాండ్ చేశారు. తమ డిమాండ్ ను ప్రభుత్వం విస్మరిస్తే ఊరుకునే ప్రసక్తే లేదని హెచ్చరించారు. ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత నాయకత్వంలో పోరాటాన్ని మరింత ముందుకు తీసుకెళ్తామని స్పష్టం చేశారు. బీసీల అంశాలు, సమస్యలపై అనేక జిల్లాల్లో రౌండ్ టేబుల్ సమావేశాలను నిర్వహించామని, వివిధ రూపాల్లో ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తున్నామని వివరించారు. బీసీలను మోసం చేస్తూ సహించేదే లేదని హెచ్చరించారు. ఎమ్మెల్సీ కవిత దీక్షకు వేలాది మంది ప్రజలు, బీసీలు తరలిరావాలని పిలుపునిచ్చారు.

## మార్కెట్లో మండే మంటలు

మొదటిపేజీ తరువాయి..

వ్యవహరించారు. మార్కెట్లు ముగిసే వారాంతానికి సెన్సెక్స్ 930.67 పాయింట్లు, నిఫ్టీ భారీగా 345.65 పాయింట్లు-, బ్యాంక్ నిఫ్టీ స్వల్పంగా 94.65 పాయింట్లు కోల్పోయాయి. అటు ఆసియా మార్కెట్లు కూడా నష్టాల్లో ముగిశాయి. జపాన్ నిక్కీ భారీగా 2.67 శాతం నష్టంతో ముగియగా, హాంకాంగ్ హాంగె సెంగ్ 1.55 శాతం నష్టంతో ముగిశాయి. ఈ క్రమంలోనే భారత స్టాక్ మార్కెట్లు సోమవారం భారీగా పతనమయ్యాయి. రికార్డు స్థాయిలో సెన్సెక్స్ 3వేల పాయింట్లు పతనం కాగా.. నిఫ్టీ వెయ్యి పాయింట్లకు పైగా పతనమైంది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రతీకార సుంకాలతో పాటు అమెరికా స్టాక్ మార్కెట్లు రికార్డు స్థాయిలో పతనమయ్యాయి. మరో వైపు ఆసియా మార్కెట్లు సైతం భారీ నష్టాల్లో కొనసాగుతున్నాయి. హాంకాంగ్, చైనా మార్కెట్లు దాదాపు 10శాతం పతనమ్యాయి. ఈ భయాలు దేశీయ మార్కెట్లపై తీవ్ర ప్రభావం చూపాయి. ఈ క్రమంలోనే సోమవారం ప్రారంభంలోనే సెన్సెక్స్ 3వేల పాయింట్లుకుపైగా పతనమైంది. నిఫ్టీ వెయ్యి పాయింట్లకుపైగా తగ్గింది. ఏప్రిల్ 4న బీఎస్‌ఈలో జాబితా అయిన అన్ని షేర్ల మొత్తం మార్కెట్ క్యాప్ రూ.4,03,34,886.46 కోట్లు- ఉండగా.. నేడు మార్కెట్లు ప్రారంభమైన కొద్దిసేపటికి రూ.3,83,95,173.56 కోట్లకు తగ్గింది. ప్రారంభంలోనే పెట్టుబడిదారుల మూలధనం రూ.19,39,712.9 కోట్ల సంపద ఆవిరైంది. సెన్సెక్స్‌లో భారతి ఎయిర్టెల్ మాత్రమే గ్రీన్ జోన్‌లో ఉంది. కానీ, కేవలం ఒకశాతం కంటే తక్కువగానే పెరిగింది. మరో వైపు ఇన్ఫోసిస్, టాటా మోటార్స్ భారీ నష్టాలను చవిచూశాయి. బీఎస్‌ఈలో 2289 షేర్లు ట్రేడవుతున్నాయి. ఇందులో 1,029 స్టాక్‌లు బలంగా కనిపిస్తున్నా.. 1,101 నష్టాల్లో కొనసాగుతున్నాయి. 24 షేర్లు ఒక సంవత్సరం గరిష్ట స్థాయికి, 23 షేర్లు ఒక సంవత్సరం కనిష్ఠానికి చేరాయి. ప్రస్తుతం నిఫ్టీలో గోద్రెజ్ కన్స్యూమర్, టెంట్ ఫార్మా మాత్రమే లాభాల్లో ఉండగా.. -టె-ంట్, టాటా స్టీల్, టాటా మోటార్స్, ఓఎన్‌జీసీ, హెచ్‌సీఎల్ టెక్, హిందాల్కో, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, జియో ఫైనాన్స్, హీరో మోటోకార్ప్, అదానీ పోర్ట్స్ భారీగా నష్టాల్లో కొనసాగుతున్నాయి.

printed, Published and Owned by GUNTOJU VISHNU MURTHY, Printed at V.M. PRINTERS Plot No : 08, Shiva shankar colony, Kuntloor( vil), Abdulpurmet(mdl), Rangareddy(dist). Telangana. Published at V.M.PUB-LICATIONS Plot No : 108, Shiva shankar colony, Kuntloor( vil), Abdulpurmet(mdl),Telangana State. Pin : 501505, Editor : GUNTOJU VISHNU MURTHY, RNI No : APTEL/31957/2009. Cell No : 96765 49223.

NEELAGIRI VARTHA TELUGU DAILY neelagirivartha@gmail.com

# నీలగిరి వార్త

తెలుగు దిన పత్రిక
మన కోసం మన వార్త

తెలంగాణ ఉమ్మడి జిల్లాలు
మంగళవారం 8-4-2025




## స్పందనకు వందనం

**- సబ్ కలెక్టర్, ఎమ్మెల్యే ఆదేశాలతో చిలకల డోన్ గ్రామ సీసీ రోడ్డు పున ప్రారంభం**

**- ధన్యవాదాలు తెలిపిన ఏపీ ఎమ్మార్పీఎస్ నాయకులు గుండు పోగుల నేపాల్**



కర్నూలు జిల్లా మంత్రాలయం మండలం చిలకల డోన్ గ్రామంలోని సీసీ రోడ్డు ను మొత్తం కాకుండా సగమే సీసీ రోడ్డు వేసినందుకు గ్రామ ప్రజలు బాధపడి ఏపీ ఎమ్మార్పీఎస్ గుండు పోగుల నేపాల్ తెలపడంతో స్థానికులు కష్టలను అర్థం చేసుకొని గ్రామ ప్రజల సమస్యను ఏపీ ఎమ్మార్పీఎస్ గుండు పోగుల నేపాల్, సబ్ కలెక్టర్ భారత్వాజ్ కు పిర్యాదు చేయడంతో సబ్ కలెక్టర్ స్పందించి సీసీ రోడ్డు సమస్యను వెంటనే పరిష్కారం చేయాలనీ అధికారులకు సూచనలు చేశారు. అధికారులు ఎమ్మెల్యే దృష్టి కి తీసుకొని వెళ్లడంతో ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి ప్రజా సమస్యల పై ప్రతి ఒక్కరూ ఎప్పటికి అప్పుడే స్పందించి పని చేయాలనీ తెలిపి గ్రామ రోడ్డు సమస్య పరిష్కర దిశగా పనులను చేయాలనీ అధికారులకు సూచనలు చేయడంతో గ్రామ సీసీ రోడ్డు పూర్తిగా వేయడం జరిగిందని గ్రామస్తులు, ఏపీ ఎమ్మార్పీఎస్ నాయకులు గుండు పోగుల నేపాల్ సంతోషం వ్యక్తం చేశారు. సబ్ కలెక్టర్ భరద్వాజ్ కు, ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి కు, సర్పంచ్ గుజ్జుల నాగమ్మ, కు లకు ధన్యవాదములు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్, ప్రభాకర్, దావీద్, సత్య వేదమ్మ తదితరులు పాల్గొన్నారు .

## కస్పాశ్రీకాంత్ మరణం చాలా బాధాకరం

**తెలంగాణ బ్రాహ్మణ సేవాసమితి రాష్ట్ర కార్యవర్గ నాయకులు**

చెన్నూరి అన్వేషి , బ్యూరో ఛీఫ్ నీలగిరివార్త



పంతంగి వాస్తవ్యుడు బ్రాహ్మణ సేవాసమితి రంగారెడ్డి జిల్లా నేత కస్పా శ్రీకాంత్( 48) రెవెన్యూ శాఖలో పనిచేస్తున్న శ్రీకాంత్ అకాల మరణం చెందారు. వీరి పార్థీవదేహాన్ని సందర్శించిన తెలంగాణ రాష్ట్ర బ్రాహ్మణ సేవా సమితి రాష్ట్ర అధ్యక్షులు పోచంపల్లి రమణారావు,వర్కింగ్ ప్రెసిడెంట్ సీనియర్ పాత్రికేయులు తన ప్రగాఢ సంతాపాన్ని కుటుంబ సభ్యులను కలిసి తెలియజేశారు. శ్రీకాంత్ తెలంగాణ బ్రాహ్మణ సేవా సమితి రంగారెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యులుగా పనిచేశారు. వారి మరణం సంఘానికి తీరని లోటు అనివారిని తలచుకొని వారి కుటుంబ సభ్యులకుసంతాపాన్ని తెలియజేశారు. ఇంకా ఈ కార్యక్రమంలో తెలంగాణ బ్రాహ్మణ సేవా సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు దేవులపల్లి రంగారావు. మరొక రాష్ట్ర ఉపాధ్యక్షులు కాణాల శ్యామసుందర్రావు. రాష్ట్ర కోశాధికారి మంత్రి సునీల్ కుమార్. రంగారెడ్డి జిల్లా సహాయ కార్యదర్శి దేవులపల్లి అశోక్ కుమార్. ప్రచార కార్యదర్శి గూడ జయరాం. నరువా రఘు. గుండం రాజ్ సత్య ప్రకాష్ పోచంపల్లి మధుసూదన్ రావుతదితర బ్రాహ్మణ సంఘ సభ్యులు హాజరై వారి మరణానికి సంతాపాన్ని తెలియజేశారు.

## శ్రీ సీతారాముల పుష్ప రథోత్సవం



దేవరకొండ నీలగిరి వార్త

దేవరకొండ పట్టణంలోని శ్రీ కోదండ రామాలయంలో శ్రీరామనవమి పురస్కరించుకొని రెండవ రోజు సోమవారం సాయంత్రం పుష్ప రథోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు . ఈ సందర్భంగా సీతారాములను పట్టణ పురవీధుల గుండా భజనలు కీర్తనలు నృత్యాలతో అంగరంగ వైభవంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఆలయ పురోహితులు ఉప్పల శ్రీనివాస్ శర్మ కుంకుమార్చన కార్యక్రమాన్ని నిర్వహించగా స్వామివారి పుష్పరదోత్సవం సాయంకాలం పట్టణ పురవీధుల గుండా ఊరేగించారు. ఈ కార్యక్రమంలో మహిళలతో పాటు ఆలయ అధ్యక్షులు గాజుల ఆంజనేయులు , ప్రధాన కార్యదర్శి బొడిగె రవీందర్ గౌడ్, కోశాధికారి వనపర్తి మురళి, గాజుల రాజేష్ ,వనం జగదీశ్వర్ , ముసిని అంజన్, గుండాల శివ యాదవ్, పోలగోని గణేష్ గౌడ్, బెల్లి మహేష్ , పున్న వెంకటేష్ నేత పుల్లయ్య,తదితరులు పాల్గొన్నారు.

## హెల్త్ అవేర్నెస్ వాక్ నిర్వహించిన ఆయుర్వేదిక్ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు




వరంగల్ సిటీ నీలగిరి వార్త.

ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని అనంతలక్ష్మి ప్రభుత్వ ఆయుర్వేదిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అనసూర్య, వైద్యశాల సూపరిండెంటెంట్ డా. పద్మావతి ఆదేశాల మేరకు కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ పోతు మహేష్ ఆధ్వర్యంలో సోమవారం వరంగల్ నగరంలోని ఆయుర్వేదిక్ వైద్యశాల ప్రాంతంలో కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు హెల్త్ అవేర్నెస్ వాక్ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ అశోక్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ విద్యార్థులు కూరగాయల మార్కెట్, పండ్ల మార్కెట్లో ప్రజలకు కరపత్రాలు పంపిణీ చేసి ఆరోగ్య సంబంధ విషయాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్లు డాక్టర్ జ్ఞానేశ్వర్, డాక్టర్ శ్రీధర్, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ జగన్ మోహనా చారి, డాక్టర్ ఈశ్వర్, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## మట్టిలో మాణిక్యాలను వెలికి తీసిన "విపంచి"

**జీవన సాఫల్య, ఉగాది పురస్కారాలు**

హైదరాబాద్ నీలగిరి వార్త :



భాషా సంస్కృతిక శాఖ సౌజన్యంతో, విపంచి ఫౌండేషన్ ఆధ్వర్యంలో శ్రీ విశ్వ వాసు నామ ఉగాది పురస్కారాలు -2025, 2022, 23, 24, జీవన సాఫల్య పురస్కారాలను రవీంద్ర భారతి లోని ఆడిటోరియంలో నిర్వహించారు. విపంచి చైర్మన్ అనుముల శ్రీనివాస్ అధ్యక్షతన, ముఖ్య అతిథిగా డాక్టర్ ఏనుగు నరసింహారెడ్డి స్పెషల్ గ్రేడ్ కలెక్టర్, ఇతర ముఖ్య అతిథుల చేతుల మీదుగా అవార్డు లను ప్రధానం చేశారు. వివిధ రంగాలలో పని చేసి గుర్తింపు లేకుండా గ్రామీణ ప్రాంతాలలో సేవలను అందిస్తున్న మట్టిలో మాణిక్యాలను వెలికి తీసి వారికి అవార్డులను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సామాజిక, ఆరోగ్యం, విద్య, సాహిత్యం, కళలు వివిధ రంగాలలో బయటి ప్రపంచానికి తెలియని ఎందరినో "విపంచి ఫౌండేషన్" గుర్తించి అవార్డులు ఇవ్వటం ఎంతో గర్వ కారణం అని అన్నారు. నేటి సమాజంలో డబ్బులు ఇచ్చి అవార్డులు కొనుక్కునే వారు ఉన్నారని, ఈ అవార్డుల ఎంపికలో వీరి నైపుణ్యాన్ని చూస్తేనే తెలిసిపోతుందని గుర్తు చేశారు. అవార్డు గ్రహీతలు వారి మనోగతలను తెలియజేశారు. ఎక్కడో మారుమూల పల్లెల్లో ఉన్న మా సేవలను గుర్తించి ఈ అవార్డులు అందజేసిన విపంచి ఫౌండేషన్ నిర్వాహకులు అడుగుల శ్రీనివాస్, వారి మిత్ర బృందానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. జీవన సాఫల్య పురస్కార గ్రహీతలు : ప్రొఫెసర్ ఎన్ లక్ష్మణరావు, హైదరాబాద్ (2022), కూర రఘువీర్, హైదరాబాద్ (2023), గాదె వినోద్ రెడ్డి, నల్గొండ జిల్లా (2024)

ఉగాది పురస్కార గ్రహీతలు (2022): పోలోజు రాజు గాయకులు యాదాద్రి భువనగిరి జిల్లా, సామల పణికుమార్, సాహిత్యం నల్లగొండ జిల్లా, ఎండి ఫర్హాత్ సామాజికం (ప్రజారోగ్య కోవిడ్ 19 వారియర్) యాదాద్రి భువనగిరి జిల్లా, గడ్డం సత్యనారాయణ సామాజికం (గ్రామీణ గ్రంథాలయ సేవ) సూర్యాపేట జిల్లా, శ్రీపాద శ్రీనివాస్ సాహిత్యం రంగారెడ్డి జిల్లా (2023): రామోజీ పాండు రంగా చారి జానపద గాయకులు రంగారెడ్డి జిల్లా, డాక్టర్ నర్ర ప్రవీణ్ రెడ్డి సాహిత్యం నల్లగొండ జిల్లా, చిట్టిపోలు వెంకటేశం యక్షగానం, యాదాద్రి భువనగిరి జిల్లా, మంద అనిల్ సామాజికం, గ్రంథాలయ స్థాపన, పెద్దపల్లి జిల్లా, అంతటి సదానందం సాహిత్యం నల్లగొండ జిల్లా, (2024): డాక్టర్ కళ్యాణ చక్రవర్తి సామాజికం, (ప్రజా ఆరోగ్యం) నల్గొండ జిల్లా, సర్దార్ బహదూర్ సింగ్ సాహిత్యం నల్గొండ జిల్లా, కొండపి వెంకట గణేష్ బాబు సామాజికం, విశాఖపట్నం జిల్లా, గంట రామ్మోహన్ రెడ్డి సామాజికం ( గ్రామీణ గ్రంథాలయ స్థాపన) కడప జిల్లా, శ్రీయాన్ శ్రీరంగం బాలల కార్టూనిస్ట్ హైదరాబాద్ జిల్లాల వారిని ప్రశంసా పత్రం, మెమొంటో, శాలువా లతో సత్కరించారు. ఈ సందర్భంగా విపంచి చైర్మన్ అనుముల శ్రీనివాసు మాట్లాడుతూ అవార్డుల కార్యక్రమానికి మేము పిలువగానే విచ్చేసిన ముఖ్య అతిథులు, అవార్డు గ్రహీతలు, భాషా సంస్కృతిక సంస్థకు, అభిమానులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో సినీ గేయ రచయిత అభినయ శ్రీనివాస్, తెలంగాణ ఉద్యమకారుడు దరువు అంజన్న, సాహిత్య అకాడమీ కార్యదర్శి నామోజు బాలా చారి, వివిధ రంగాల అవార్డు గ్రహీతలు, నిర్వాహకులు విపంచి ఫౌండేషన్ సభ్యులు, అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.

## వరంగల్ పశ్చిమ నియోజకవర్గ అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలి

**వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి**

హనుమకొండ నీలగిరి వార్త.

హనుమకొండ వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలోని వివిధ అభివృద్ధి పనులను సంబంధిత శాఖల అధికారులు త్వరగా పూర్తిచేసే విధంగా చర్యలు చేపట్టాలని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. సోమవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలోని వివిధ అభివృద్ధి పనులపై నగర మేయర్ గుండు సుధారాణి, కుడా చైర్మన్ వెంకట్రామ్ రెడ్డి, జిల్లా కలెక్టర్ ప్రావీణ్య, కుడా వైస్ చైర్మన్ అశ్విని తానాజీ వాకడే లతో కలిసి సంబంధిత శాఖల అధికారులతో అభివృద్ధి పనులపై సమీక్షించారు. ఈ సందర్భంగా భద్రకాళి చెరువు పూడికతీత పనులు, భద్రకాళి మాఢవీధుల నిర్మాణ పనుల పురోగతి, జవహర్ లాల్ నెహ్రూ స్టేడియంలో జరుగుతున్న అభివృద్ధి పనులు, రోడ్ల విస్తరణ పనులు, ఇందిరమ్మ ఇండ్లు,



బిహెచ్కె పనుల పురోగతిపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ భద్రకాళి చెరువు పూడికతీత పనులను వర్షాకాలం కంటే ముందే పూర్తి చేయాలన్నారు. ఏమైనా ఇబ్బందులు ఉన్నట్లయితే తన దృష్టికి తీసుకురావాలన్నారు. భద్రకాళి మాఢ వీధుల నిర్మాణంలో ఏవైన ఇబ్బందులు ఉన్నట్లయితే వాటిని వెంటనే పరిష్కరించాలన్నారు. జవహర్ లాల్ నెహ్రూ స్టేడియంలో ఇండోర్ స్టేడియం, జిమ్నాస్టిక్స్, స్విమ్మింగ్ పూల్ పునరుద్ధరణ పనులు వారంలో ప్రారంభించి నెలాఖరు నాటికి పూర్తి చేయాలన్నారు. నగరంలో రోడ్ల విస్తరణ పనులను త్వరగా పూర్తిచేయాలని, ఇబ్బందులు ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. వరంగల్ పశ్చిమ నియోజకవర్గం పరిధిలోని ఇందిరమ్మ ఇండ్లు, డబుల్ బెడ్ రూమ్ ఇళ్లకు సంబంధించి లబ్ధిదారుల జాబితాను సిద్ధం చేయాలన్నారు. ప్రజల సందర్శనార్థం కలెక్టర్ పాత భవనాన్ని పునర్వినియోగం కోసం ప్రతిపాదనలు సమర్పించాలని అధికారులను ఆదేశించారు. దీనికి సంబంధించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి , కుడా పిఓ అజిత్ రెడ్డి, ఈఈ భీమ్ రావు, ఇరిగేషన్ ఎస్ఈ వెంకటేశ్వర్లు, హనుమకొండ ఆర్డీవో రాథోడ్ రమేష్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## వరంగల్‌లో జాబ్ మేళా ఏర్పాట్లపై మంత్రి కొండా సురేఖ ఆరా

**టాస్కు సీఈఓ శ్రీకాంత్ సింహ, సీఆర్ఓ ప్రదీప్, ఓఎస్డీ సుమంత్, శ్రీనివాస్‌తో భేటీ**

**జాబ్ మేళా విజయవంతం చేయాలని మంత్రి సురేఖ ఆదేశం**

వరంగల్ బ్యూరో నీలగిరి వార్త.

తెలంగాణ రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ప్రత్యేక చొరవ తీసుకొని ఏప్రిల్ 11న వరంగల్ జిల్లా నిరుద్యోగ యువతీ, యువకులకు టాస్క్ సంస్థ సౌజన్యంతో ఏర్పాటు చేస్తున్న మెగా జాబ్ మేళాను నిరుద్యోగ యువత అందరూ సద్వినియోగం చేసుకునే విధంగా ఏర్పాట్లు చేయాలని ముమ్మర ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ మేరకు సోమవారం రాష్ట్ర మంత్రి కొండా సురేఖ హైదరాబాద్ లోని తన నివాసంలో జాబ్ మేళా నిర్వాహకులు, ఉన్నతాధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో టాస్కు సీఈఓ శ్రీకాంత్ సింహ, సీఆర్ఓ ప్రదీప్ రెడ్డి, అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి ఓఎస్డీ నార్ల సుమంత్, స్పెషల్ ఆఫీసర్ శ్రీరాముల శ్రీనివాస్ పాల్గొన్నారు. కాగా, ఈ జాబ్ మేళకు హాజరవుతున్న కంపెనీల వివరాలు మంత్రి సురేఖకి వారు వివరించారు. అయితే, అత్యధిక నిరుద్యోగ యువతకి ఈ జాబ్ మేళను సద్వినియోగం చేసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని మంత్రి వారికి సూచించారు. జాబ్ మేళాకి హాజరయ్యే వారికి భోజనం, మంచి నీటి ఏర్పాటు చేయాలని... అందుకోసం తాను వ్యక్తిగతంగా ఆర్థికంగా కూడా సహకారం అందిస్తానని మంత్రి స్పష్టం చేశారు. ప్రస్తుతం వేసవికాలం కావడంతో... ఎండలు బాగా ఉన్నాయని... జాబ్ మేళాకు హాజరయ్యే వారు ఎటువంటి ఇబ్బందులు పడకుండా ఉండాలంటే వైద్య సదుపాయం కూడా ఏర్పాటు చేయాలని మంత్రి చెప్పారు. అక్కడ రెండు లేదా మూడు అంబులెన్స్ కూడా జాబ్ మేళా వద్ద ఉంచాలని ఎవరికైనా నిరుద్యోగులకు ఆ సమయంలో అనారోగ్యం లేదా అస్వస్థత ఏర్పడితే వాటి ద్వారా వారికి వైద్య సదుపాయం అందించవచ్చని మంత్రి సూచించారు. జిల్లా కలెక్టర్, పోలీసులు, మున్సిపల్ అధికారులు, ఇతర అధికారులతో సమన్వయం చేసుకొని ఎటువంటి ఇబ్బంది రాకుండా పోలీస్ బందోబస్తు కూడా ఏర్పాటు చేసుకునేందుకు తగిన ప్రణాళికలు రచించాలని మంత్రి సురేఖ వెల్లడించారు. కాగా, వరంగల్ జిల్లా యువతీ యువకులందరూ మెగా జాబ్ మేళా కార్యక్రమంలో పాల్గొని, తమ పేరును నమోదు చేసుకొని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకునే వివరాలను మంత్రి స్వయంగా తెలుసుకున్నారు. నిర్వాహకులు ఇటీవల మంత్రి చేత విడుదల చేయించిన పోస్టర్ లో ఉన్న క్యూఆర్ కోడ్ ద్వారా నిరుద్యోగ యువతీ యువకులు ఎన్ రోల్ చేసుకోవాలన్నారు. ఏప్రిల్ 11వ తేదీన ఉదయం 9:30 గంటల నుండి వరంగల్ లోని ఎంకే నాయుడు ఫంక్షన్ హాల్ లో ప్రారంభం అవుతుందని తెలిపారు.



## సన్న బియ్యం పంపిణీ చారిత్రాత్మకమైన నిర్ణయం

**దళితులతో కలిసి వారి ఇంట్లో సహపంక్తి భోజనం చేసిన షబ్బీర్ అలీ**


కామారెడ్డి జిల్లా ప్రతినిధి: నీలగిరి వార్త:

మాచారెడ్డి గ్రామంలో ప్రజాపాలనలో భాగంగా పేదలకు అందించే ఉచిత సన్నబియ్యం పంపిణీ కార్యక్రమానికి హాజరై, అధికారులు, ప్రజాప్రతినిధుల తో కలిసి లబ్ధిదారులకు సన్న బియ్యం పంపిణీ చేసి దళితులతో సహపంక్తి భోజనం చేసిన ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్.

ఈ సందర్భంగా షబ్బీర్ ఆలీ మాట్లాడుతూ సన్న బియ్యం లబ్ధిదారుని ఇంట్లో భోజనం చేయడం ఎంతో ఆనందంగా ఉంది.నేను పుట్టిన గ్రామంలో దళితుని ఇంట్లో అన్నం తింటుంటే నా సొంతింట్లో తిన్నట్టు అనిపిస్తుంది.సన్నబియ్యం పంపిణీతో పేదవాడి కుటుంబం ఆనందంతో పెద్దోలు తినే బియ్యం పేదోలు తింటున్నారు.రాష్ట్రంలో దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న నిరుపేదలందరికీ పూర్తిస్థాయిలో ఆహార భద్రత కల్పించేందుకే సన్నబియ్యం పంపిణీ కార్యక్రమం చేపట్టామని తెలిపారు. ఈ పథకం పేద ప్రజల కడుపు నింపడానికే 80 శాతానికి పైగా బడుగు, బలహీన, దళిత, గిరిజన, మైనారిటీ నిరుపేద ప్రజలు



లబ్ధి పొందుతున్నారని అన్నారు. ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ చూపాలని సూచించారు. సన్నబియ్యం సరఫరాలో ఎలాంటి అవకతవకలు జరగనివ్వొద్దు. గోదాముల నుంచి బియ్యం రవాణా, రేషన్ షాపుల నుంచి లబ్ధిదారులకు పంపిణీ చేయడంలో ఏమైనా లోటుపాట్లు ఉంటే సరిచేయాలి.అని అధికారులను ఆదేశించారు. ప్రజల నుంచి ఏమైనా ఫిర్యాదులుంటే పరిష్కరించాలి. ప్రతి లబ్ధిదారుడికి సన్నబియ్యం చేరేలా చర్యలు తీసుకోవాలి. డీలర్లుగానీ, అధికారులు గానీ ఏమైనా అవకతవకలకు పాల్పడితే ఉపేక్షించేది లేదు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటాం అని హెచ్చరించారు. కోట్లు పెట్టి దొడ్డు బియ్యం పంపిణీ చేసిన అది పక్కదారీ పట్టింది. ఇప్పుడు రూ.13 వేల కోట్లు వెచ్చించి 30 లక్షల టన్నుల సన్న బియ్యాన్ని పేదలకు అందిస్తున్నామన్నారు. కొత్త రేషన్ కార్డుల పంపిణీ, సభ్యుల నమోదు ప్రక్రియ ప్రారంభమైందని, అర్హులైన పేదలందరినీ లబ్ధిదారులుగా నమోదు చేస్తామని చెప్పారు.ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ విక్టర్, ఆర్డీవో. ఎమ్మార్వో ఎంపీడీవో. అధికారులు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# మంబోజిపల్లి చౌరస్తాలో సైబర్ నేరాలపై అవగాహన సదస్సు

**మెదక్ రూరల్ ఏ ఎస్సై వెంకటయ్య**




నీలగిరి వార్త:మెదక్ జిల్లా బ్యూరో:ఏప్రిల్ 07:

మెదక్ మండలం మ%శీ%బోజి పల్లి గ్రామంలో మెదక్ రూరల్ ఏ ఎస్సై వెంకటయ్య పోలీస్ సిబ్బందితో వెళ్లి సైబర్ నేరాలపై అవగాహన సదస్సు నిర్వహించారు.అవగాహన సదస్సులో ప్రజలతో యేసయ్య వెంకటయ్య మాట్లాడుతూ అపరిచిత వ్యక్తుల నుండి ఫోన్ కాల్స్ కానీ,లోన్సు ఇస్తామని మీ అకౌంట్ నంబర్ కావాలని అడిగితే ఇవ్వవద్దని మెదక్ రూరల్ ఏఎస్ఐ వెంకటయ్య ప్రజలకు తెలియజేశారు. బహుమతులు గెలిచు కున్నారని కాల్ చేసి చెపుతున్నారనీ అలాగే మీకు డ్రాలో బహుమతులు పొందారని ఓటిపి నంబర్ చెప్పమని ఆడిగినచో వారికి ఎలాంటి సమాచారం ఇవ్వకూడదని ఏఎస్ ఐ వెంకటయ్య తెలియజేశారు. సోమవారం రోజున మెదక్ మండలంలోని మంబోజిపల్లి గ్రామంలో సైబర్ నెరలపై ప్రజలకు అవగాహన కల్పించారు.ఫోన్ చేసి అడిగిన వెంటనే మీ బ్యాంకు వివరాలు ఫోన్ చేసిన వారికి ఇవ్వకూ డదని తెలిపారు.పొరపాటున కూడా ఏటీఎం నంబర్ ఇచ్చి మోసపోవద్దని చెప్పారు.సైబర్ నెరాలపై అప్రమత్తంగా వుండాలని పేర్కొన్నారు.సైబర్ నేరాలకు గురి అయిన వారు వెంటనే 1930 నంబర్ కు కాల్ చెయ్యాలని అన్నారు.ఈ అవగాహన కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది వేణుకుమార్, విఠల్, ఇస్మాయిల్,విజయ్ కుమార్ గౌడ్,మంబోజపల్లి గ్రామస్తులతో పాటు కూరగాయల మార్కెట్ కు వచ్చిన పరిసర ప్రాంతాల ప్రజలు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ హయాంలోనే ఎంతో అభివృద్ధి : నారాయణఖేడ్ శాసనసభ్యులు పట్లోళ్ల సంజీవరెడ్డి



నీలగిరి వార్త నారాయణఖేడ్ ఏప్రిల్ 7.

కాంగ్రెస్ పార్టీ హయంలోనే నారాయణఖేడ్ నియోజకవర్గం అని రంగాల్లో ఎంతో అభివృద్ధి జరిగింది అని ఎం ఎల్ ఎ పి సంజీవ రెడ్డి అన్నారు సోమవారం నారాయణఖేడ్ మున్సిపాలిటీ పరిధిలోని బస్ డిపో సమీపంలో పద్మశాలి కాలనీలో సీసీ రోడ్ల పనులను భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏం ఎల్ ఎ మాట్లాడుతూఎన్నో సంవత్సరాలుగా కాలనిలో రోడ్లు లేక ఇబ్బంది పడే వారు అన్నారు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అన్ని వార్డు లలో సీసీ రోడ్లు ,మురుగు కాలువల నిర్మాణం చేపటం జరిగింది అన్నారు కాంగ్రెస్ పార్టీ అంటేనే పేదలకు అదుకునే పార్టీ అన్నారు అనంతరం పద్మశాలి కలని వాసులు ఏం ఎల్ ఎ కు పూలమాల శాలువాలతో సన్మానించారు నారాయణఖేడ్ మున్సిపాలిటీ నీ ఆదర్శం గా తీర్చిదిద్దడమే కాంగ్రెస్స్ పార్టీ లక్ష్యం అన్నారు ఈ కార్యక్రమంలో మున్సిపల్ తాజా మాజీ వైస్ చైర్మన్ ధరం శంకర్ సెట్ ,మున్సిపల్ కమిషనర్ జాగ్జీవన్ నాయకులు శెట్టి శంకర్ , పండరి రెడ్డి,కూచుని ప్రకాష్ ,శ్రీశైలం పంతంగి రమేష్ ,చంద్ర శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# భార్య ఇంటికి కాపురానికి రావడం లేదని భర్త ఆత్మహత్య



కామారెడ్డి జిల్లా ప్రతినిధి: నీలగిరి వార్త:

కామారెడ్డి పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న ఇందిరానగర్ కాలనీకి చెందిన బోదాసు రాజు, తండ్రి పేరు బక్కయ్య, వయసు 35 సంవత్సరాలు, కులము వడ్డెర, వృత్తి: కూలి పని చేయు వ్యక్తి కి 13 సంవత్సరాల కిందట లక్ష్మీ అనే ఆమెతో వివాహం జరగగా, వారికి ఇద్దరు సంతానం కలిగినారు. ఆ తర్వాత సంసార విషయంలో భార్యాభర్తల మధ్య గొడవ కారణంగా, అతని భార్య లక్ష్మి అతనిని వదిలి తల్లి ఇంటి వద్దనే ఉంటుంది. ఆ విషయంలో మద్యానికి బానిస అయిన రాజు తేదీ 6-4-2025 నాటి రాత్రి సమయంలో ఇంట్లో ఫ్యాన్ కు చీరతో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. సోమవారం ఉదయం గమనించిన అతని అన్న యాదగిరి, తన తమ్ముడు అయిన రాజు భార్య కాపురానికి రావడం లేదనే ఉద్దేశంతో జీవితం పై విరక్తి చెంది, ఉరివేసుకొని చనిపోయినట్లుగా ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేయడం జరిగింది.

# అంగరంగ వైభవముగా జరిగిన శ్రీ సీతారామచంద్ర స్వామి వారి కల్యాణ మహొత్సవము



కామారెడ్డి జిల్లా ప్రతినిధి: నీలగిరి వార్త:

కామారెడ్డి పట్టణము శ్రీ సంకష్టహర మహాగణపతి క్షేత్రములో నిన్నటి రోజున అనగా 06-04-2025 ఆదివారము శ్రీరామనవమి పర్వకాలమును పురస్కరించుకొని సాయం కాలము 6 గంటల నుండి రాత్రి 11 గంటల వరకు వే.మూ,బ్ర.శ్రీ గంగవరం ఆంజనేయ శర్మ ఆధ్వర్యములో అర్చకులు, ఆలయ కమిటి, భవానీ మహిళా మండలి మరియు సమస్త భక్తుల సంపూర్ణ సహకారముతో శ్రీ సీతారామ చంద్ర స్వామి వారి కల్యాణ మహొత్సవము చిన్నారుల సంగీత కచేరి భక్తుల కోలాటాల మధ్య కల్యాణ మహొత్సవము అత్యంత వైభవ ముగా జరిగినది.కల్యాణ తదనం తరము 1000 మంది పై చిలుకు భక్తులు స్వామి వారి అన్నప్రసాదమును స్వీకరించారు. ఈ కార్యక్రమ ములో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని శ్రీ సీతా రామచంద్ర మూర్తుల కృపకు పాత్రులైనారు అని యజ్ఞం సంపత్కుమార శర్మ (ప్రధానా ర్చకులు),సుతారి అంజయ్య (అధ్యక్షులు), బొంబోతుల రవీందర్ గౌడ్ (ప్రధాన కార్యదర్శి), బెల్దె విశ్వనాథం (కోశాధికారి), మరియు కార్యవర్గ సభ్యులు పేర్కొన్నారు.



# మత ఫాసీజంతో దేశంలో ప్రమాదకర పరిస్థితులు

- ఏప్రిల్ 08 న మత ఫాసీజానికి వ్యతిరేకంగా "జాతీయ నిరసనదినం" పాటిద్దాం
- సిపిఐ(ఎంఎల్) మాస్ లైన్ కామారెడ్డి జిల్లా కార్యదర్శి రామకృష్ణ పిలుపు





కామారెడ్డి జిల్లా ప్రతినిధి: నీలగిరి వార్త:

మత ఫాసీజంతో దేశంలో ప్రమాదకర పరిస్థితులు నెలకొన్నాయి అని ఏప్రిల్ 08 న మత ఫాసిజానికి వ్యతిరేకంగా "జాతీయ నిరసనదినం" పాటిద్దాం అని సిపిఐ(ఎంఎల్) మాస్ లైన్ కామారెడ్డి జిల్లా కార్యదర్శి పీ.రామకృష్ణ పిలుపును ఇచ్చారు.సోమవారం నాడు సిపిఐ(ఎంఎల్) మాస్ లైన్ జాతీయ కమిటీ పిలుపు మేరకు కామారెడ్డి జిల్లా కేంద్రం లో బైక్ ర్యాలీ నిర్వహించడం జరిగింది. ఆ తరువాత జిల్లా కలెక్టర్ కు డిమాండ్స్ తో కూడిన మెమోరాండం సమర్పించడం జరిగింది. ఈ సందర్భంగా సిపిఐ(ఎంఎల్) మాస్ లైన్ కామారెడ్డి జిల్లా కార్యదర్శి పీ.రామకృష్ణ మాట్లాడుతూ, మన దేశం ప్రజాస్వామిక, సౌమ్యవాద దేశం అని ఇక్కడ విభిన్న మతాలు విభిన్న జాతులు కలిసి జీవిస్తున్న ప్రత్యేకమైన దేశం అన్నారు. అయితే గత కొంతకాలంగా మత ఫాసిజం దేశంలో పెరిగిపోయి పలు మతాల మధ్య ఘర్షణ వాతావరణం, మతోన్మాద చర్యలు పెరిగిపోతున్నాయన్నారు. ప్రజలు స్వేచ్ఛగా జీవించలేని పరిస్థితి ఏర్పడిందనీ ఆందోళన వ్యక్తం చేశారు. దేశంలో విద్య కుంటుబడిందని, నిత్యవసర సరకులు ధరలు ఆకాశన్నంటాయని, నిరుద్యోగం విలయతాండవం చేస్తుందన్నారు. అంతర్జాతీయ మార్కెట్లో రూపాయి విలువ పతన స్థాయికి చేరి తీవ్రమైన ద్రవ్యోల్బణం నెలకొన్నదని, స్వామి నాథన్ కమిషన్ సిఫారసులను కేంద్రం తుంగలో తొక్కి అమలు చేయడం లేదన్నారు. ఈ పరిస్థితులు చూస్తే సామాన్యుడు బతకలేని స్థితి నెలకొన్నదని, దినదిన గండముగా బతుకు వెల్లదీసే పరిస్థితి ఏర్పడిందన్నారు. ఇట్టి సమస్యలను పరిష్కరించడంలో విఫలమైన కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రత్యమ్యాయంగా ప్రజల పక్కదారి పట్టించడానికి మత ఘర్షణలు మతోన్మాద చర్యలు తీవ్రతరం చేశారన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో సైతం మతోన్మాద ఫాసిజం పెరిగేలాగా మతోన్మాదులు మత ఘర్షణలు సృష్టిస్తున్నారన్నారు. వీటికి వ్యతిరేకంగా దేశంలో అనేక కమ్యూనిస్టులు, ప్రజాస్వామిక వాదులు, లౌకిక శక్తులు ప్రజల్ని చైతన్యం చేస్తూ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఉద్యమాలు నిర్మిస్తున్నాయన్నారు. రైతాంగం పెద్దఎత్తున పోరాడుతున్నందున వారి సమస్యలను మానవత్వంతో అలోచించి పరిష్కారించాలని కోరుతున్నాం అన్నారు.

తమతో మనవి చేయునది ఏమనగా దేశంలో నెలకొన్న ప్రజా సమస్యలను పరిష్కరించుటకు ప్రత్యేక దృష్టి సారించాలని, మతసామరస్యం పెరిగి ప్రజలు సోదర భావంతో మెలిగేలా చర్యలు తీసుకోవాలన్నారు.మత ఫాసీజంకు వ్యతిరేకంగా, దేశవ్యాపిత నిరసనలకు సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ ఏప్రిల్ 08 ని "నిరసన డే" గా నిర్వహిస్తున్నది. అందులో భాగంగా పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొని నిరసనలు, ఆందోళనలను విజయవంతం చేయాలి అని ఆయన విజ్ఞప్తి చేశారు.

కార్యక్రమంలో టి యు సి ఐ రాష్ట్ర నాయకులు ఆర్. రమేష్, సిపిఐ(ఎంఎల్) మాస్ లైన్ జిల్లా నాయకులు జి.పరమేష్, జి.సురేష్, పీ.ప్రకాష్, బి. కిశోర్, ఎం. అనిస్, ఏ.ఐ. యు. కే. ఎస్ నాయకులు ఎస్. కిశోర్, ఏ.అంబన్న పివైఎల్ నాయకులు ఏ.రాజు తదితరులు పాల్గొన్నారు.


# అవుట్ సోర్సింగ్ నోటిఫికేషన్ రద్దు చేయాలి

**నీల నాగరాజు బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షులు**

**ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ ఆలీకి వినతి పత్రం అందజేత**

కామారెడ్డి జిల్లా ప్రతినిధి: నీలగిరి వార్త:

ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మెడికల్ కళాశాల అవుట్ సోర్సింగ్ బాగోతం బయటపడ్డా కూడా ఇంకా విచారణ జరగడం లేదు. అర్హతలు లేకున్నా, డబ్బులు ఇచ్చి ఉద్యోగం సంపాదించిన వాళ్ళు దర్జాగా జాబ్ చేసుకుంటున్నారని, అర్హతలు ఉండి జాబ్ రాని వాళ్ళు ఇంకా పోరాడుతూనే ఉన్నారన్నారు.నోటిఫికేషన్ వెంటనే రద్దు నూతన నోటిఫికేషన్ వేసి అర్హతలు కలిగిన అభ్యర్థులకు న్యాయం చేయాల న్నారు. కొంతమంది మ్యాన్ పవర్ ఏజెన్సీ మెరిట్ లిస్ట్ లో మొదటి స్థానంలో ఉండి కూడా జాబ్ రాని బాధితులు ఏజెన్సీ వాళ్ళని వివరణ అడిగితే వారు పొంతన లేని సమాధానాలు చెప్తున్నారని,బోనాఫైడ్ సర్టిఫికెట్ లేదని, ఎక్స్పీరియన్స్ సర్టిఫికెట్లో డేట్ లేదని చెప్పడం శోచనీయమన్నారు. ఇట్టి సంస్థపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో



బాధిత అభ్యర్థులు రవి, సురేష్, విజయ్,అరవింద్,రఘువీర్ తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

**దళారులకు ధాన్యం విక్రయించి రైతులు నష్టపోకూడదు**

**తాండూర్ కిచ్చన్నపేట ప్రాథమిక సహకార సంఘం అధ్యక్షులు, ఆకిడి గంగారెడ్డి**

**ఎల్లారెడ్డి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రజిత వెంకటరామిరెడ్డి.**



నీలగిరి వార్త ఎల్లారెడ్డి:-

దళారులకు దాన్యం విక్రయించి రైతులు నష్టపోకూడదని తాండూర్ కిచ్చన్నపేట ప్రాథమిక సహకార సంఘం అధ్యక్షులు ఆకిడి గంగారెడ్డి అన్నారు. సోమవారం తాండూరు కిచ్చన్నపేట ప్రాథమిక సహకార సంఘం పరిధిలోని, తాండూర్ ఆత్మకూర్ జలాల్పూర్ మెల్లకుంట తండా జప్తి జాన్కంపల్లి బొల్లారం రాఘవపల్లి ధాన్యం కురుమూర్తి కేంద్రాలను చైర్మన్ ఆకిడి గంగారెడ్డి, ఎల్లారెడ్డి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రజిత వెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పర్యవేక్షణ అధికారి నర్సింహం సివిల్ సప్లై, నాయబ్ తాసిల్దార్, సురేష్ మండల వ్యవసాయ అధికారి సాయికిరణ్ ఎల్లారెడ్డి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రజిత వెంకటరామిరెడ్డి ఈ కార్యక్రమంలో ప్రాథమిక సహకార సంఘం ఉపాధ్యక్షులు బాబురావు డైరెక్టర్లు వేముల సంగయ్య సిద్ధిరాంరెడ్డి విజయ్ కుమార్ గోపాల్ హనుమాన్ నాయక్ కిషన్ నాయక్ బన్సీ నాయక్ జయరాజ్ కార్యదర్శి మురళి రైతులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తులను పరిశీలించి తదుపరి చర్యలు తీసుకోవాలి

**జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్**



కామారెడ్డి జిల్లా ప్రతినిధి: నీలగిరి వార్త:

ప్రజావాణి లో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి తదుపరి చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. భూముల సమస్యలు, రెండుపడక గదుల ఇళ్లు మంజూరు, రైతు భరోసా, ఫించన్లు మంజూరు తదితర అంశాలపై ఫిర్యాదులు అందాయి. ప్రజావాణి లో (73) ఫిర్యాదులు పలు శాఖలకు చెందినవి అందాయని తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజావాణి లో వచ్చిన అర్జీలను పరిశీలించి సాధ్యా సాధ్యాల మేరకు సత్వర చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అదేవిధంగా పెండింగులో ఉన్న అర్జీలపై చర్యలు చేపట్టి దరఖాస్తు దారునికి సమాచారం అందించాలని తెలిపారు. ఈ ప్రజావాణిలో , స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, జడ్పీ సీఈవో చందర్, ఆర్డీఓ వీణ, పలు శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



# జిల్లా వ్యాప్తంగా కమ్యూనిటీ మీడియేషన్ సెంటర్ల ప్రారంభం



నిలగిరి వార్త:- ఎల్లారెడ్డి

న్యాయ సేవా ప్రాధికార సంస్థ - న్యూఢిల్లీ (నల్సా) మరియు తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవా సంస్థ - హైదరాబాద్ సంయుక్త ఆధ్వర్యంలో, కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా కమ్యూనిటీ మీడియేషన్ సెంటర్లు ఈరోజు ప్రారంభించబడ్డాయి.ఈ కార్యక్రమంలో భాగంగా, ఎల్లారెడ్డి న్యాయశాఖ పరిధిలోని ఎల్లారెడ్డి, గాంధారి, నాగిరెడ్డిపేట్, లింగంపేట్ మండలాల్లో కమ్యూనిటీ మీడియేషన్ సెంటర్లు స్థాపించబడ్డాయి. ఎల్లారెడ్డి మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కమ్యూనిటీ మీడియేషన్ సెంటర్ ప్రారంభ కార్యక్రమంలో, ఎల్లారెడ్డి మున్సిపల్ కమిషనర్ శ్రీ మహేష్ గారు మరియు ఎల్లారెడ్డి ఎస్ఐ శ్రీ బొజ్జ మహేష్ గారు ముఖ్య అతిథులుగా పాల్గొని సెంటర్‌ను ప్రారంభించారు.ఈ సందర్భంగా కోర్టు సిబ్బంది మరియు కమ్యూనిటీ మీడియేషన్ వాలంటీర్లు (సిఎంవీఎస్) కే. శ్రీనివాసాచారి గారు, గుడిపల్లి ప్రతాప్ రెడ్డి , జె. సంగప్ప పాల్గొన్నారు.కమ్యూనిటీ మీడియేషన్ సెంటర్ల ప్రారంభంతో స్థానిక స్థాయిలో ప్రజలకు త్వరిత న్యాయం అందుబాటులోకి రావడం, కేసులు కోర్టుకు వెళ్లకముందే పరస్పర సహకారంతో పరిష్కార మార్గాలు కనుగొనడం సులభతరం కానుంది.

# యువ నాయకుడు పెన్సిల్ శ్రీకాంత్‌ని ఘనంగా సన్మానం చేసిన వైశ్య సంఘం నాయకులు



నీలగిరి వార్త జిల్లా ప్రతినిధి సుందర్:-

కామారెడ్డి పట్టణ ఆర్యవైశ్య యువజన సంఘం అధ్యక్షులుగా నియమకమైన పెన్సిల్ వార్ శ్రీకాంత్ ని శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపిన శ్రీ సాయి ఆర్యవైశ్య సంఘం విద్యా నగర్ కాలనీ అధ్యక్షులు శనిశెట్టి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి జూలూరి గంగాధర్, కోశాధికారి సోమిశెట్టి ఆంజనేయులు, మ్యాడం లింగం,జెక్సాని చందు, బచ్చు నాగరాజు.

# తాళం వేసిన ఇండ్లే చోరీకి టార్గెట్



కామారెడ్డి జిల్లా ప్రతినిధి: నీలగిరి వార్త:

పాల్వంచ మండలం ఆరేపల్లి గ్రామంలో తాళం వేసిన రెండిండ్లలో దొంగలు చొరబడి నగదు, బంగారు ఆభరణాలు అపహరించుకుపోయారు. ఎర్రగొల్ల నడిపి సాయిలు తన భార్యతో కలిసి శనివారం రాత్రి 10 గంటలకు ఇంటికి తాళం వేసి కొడుకు ఇంట్లో పడుకున్నారు. తిరిగి ఉదయం 6 గంటలకు ఇంటికి రాగా ఇంటి తాళం పగలగొట్టి ఉంది. ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువా తాళం పగలగొట్టి అందులోనుండి మూడు తులాల బంగారం పుస్తెలతాడు 20వేల నగదు అపహరించుకుపోయారు. అదే గ్రామానికి చెందిన భువనగిరి రాజు ఇంటి తాళం పగులగొట్టి దొంగతనానికి పాల్పడ్డట్లు ఫిర్యాదు చేయగా మాచారెడ్డి ఎస్ఐ అనిల్ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు తెలిపారు.



కామారెడ్డి జిల్లా ప్రతినిధి: నీలగిరి వార్త:

ఎన్జీవోఎస్ కాలనీ లో ఉన్న సెల్ టవర్ దగ్గర మానసిక స్థితి సరిగా లేక, ఎండలో ఉన్న వ్యక్తిని హాస్పిటల్ కి తరలిస్తున్న కామారెడ్డి పట్టణ పోలీస్ కానిస్టేబుల్ లు అరుణ్, రాజిరెడ్డి.

# సన్న బియ్యం దేశానికే ఆదర్శం

**ఆర్థిక ఇబ్బందులున్న సంక్షేమ పథకాలకు పెద్దపీట...**

**శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్**



శేరిలింగంపల్లి. నీలగిరి వార్త

శేరిలింగంపల్లి డివిజన్ లోగల నెహ్రూనగర్ లోని రేషన్ షాప్ లో ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన సన్న బియ్యం పంపిణి కార్యక్రమాన్ని శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ గారు మాట్లాడుతూ...రాష్ట్రంలో పేదల ఆహార భద్రతకు ప్రభుత్వం పెద్దపీట వేసిందని అన్నారు. దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న తెల్ల రేషన్ కార్డు కలిగిన కుటుంబాలకు సన్న బియ్యం పంపిణీ ప్రారంభం అయ్యిందని దేశంలోనే సన్న బియ్యం ఇస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ రాష్ట్రమని ప్రజాప్రభుత్వం అని రాష్ట్రంలో ప్రతి పేద, మధ్య తరగతి కుటుంబాలకు న్యాయం జరిగే విధంగా ప్రజా ప్రభుత్వం ముందుకు వెళుతుంది అనడానికి నిదర్శనమని అన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు యాదా గౌడ్, మాజీ కౌన్సిలర్ రాజేశ్వరమ్మ, ప్రధాన కార్యదర్శి రవీందర్ గౌడ్, వార్డ్ మెంబర్ పర్వీన్ బేగం, కేఎన్ రాములు, గోపినగర్ బస్తీ అధ్యక్షులు గోపాల్ యాదవ్, శ్రీకాంత్, కుమార్, రంజిత్, నాని, ఎల్లదాస్, దస్తగిర్, జగదీశ్, రాకేష్ స్థానికవాసులు తదితరులు పాల్గొన్నారు.

# జేఎల్ఎం షాపింగ్ మాల్ పై జిల్లా అధికారులకు ఫిర్యాదు

**9 రూపాయలకే చీర ప్రకటనలు చూసి మోసపోయాం**

**ఉపాధి హామీ కూలికి పోతే రూ 250 ఐన వచ్చిండేది , కూలి పనికి పోతే 400 వచ్చిండేవి**

**ప్రజలను మోసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి.**

**- తీన్మార్ మల్లన్న టీం వికారాబాద్ జిల్లా అధ్యక్షులు ఘణపురం శ్రీనివాస్...**

నీలగిరి వార్త వికారాబాద్ జిల్లా ప్రతినిధి

వికారాబాద్ జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 7 : వికారాబాద్ పట్టణంలో జేఎల్ఎం షాపింగ్ మాల్ వలన ప్రయాణికులకు ఇబ్బంది కలుగుతుందని తీన్మార్ మల్లన్న టీం వికారాబాద్ జిల్లా అధ్యక్షులు ఘణపురం శ్రీనివాస్ సోమవారం వికారాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయం, ఎస్పీ కార్యాలయం, వికారాబాద్ మున్సిపల్ కమిషనర్ కు ఫిర్యాదు చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఈనెల నాలుగవ తేదీన వికారాబాద్



పట్టణంలో ప్రారంభమైన జేఎల్ఎం షాపింగ్ మాల్ మోసపూరితమైన ప్రకటన చేయటం వలన వారు ఉపాధి కోల్పోయారని ప్రకటనల పేరుతో మోసం చేయడం సరైనది కాదన్నారు ఇట్టి విషయన్ని జిల్లా కలెక్టర్ గారి దృష్టికి మరియు జిల్లా ఎస్పీ దృష్టికి తీసుకెళ్లామని తీన్మార్ మల్లన్న టీం వికారాబాద్ జిల్లా అధ్యక్షులు గణపురం శ్రీనివాస్ తెలిపారు. మరియు మున్సిపల్ కమిషనర్ గారికి ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. అదేవిధంగా షాపింగ్మాల్ ముందు ఉన్నటువంటి ప్రధాన రహదారి పార్కింగ్ ద్వారా సమస్యలు తలెత్తుతున్నాయి అన్నారు. షాపింగ్ మాల్ ముందే పార్కింగ్ కాకుండా ఇతర షాపులో ముందు కూడా పార్కింగ్ చేయడంతో పాటు రాకపోకల వాహనాలకు ఇబ్బంది కలగడం జరుగుతుందన్నారు. పార్కింగ్ చేసే సమయంలో ప్రధానంగా రోడ్డుపైనే పార్కింగ్ చేయడం జరుగుతుందన్నారు. రోడ్డుపై పార్కింగ్ చేయడం ద్వారా రోడ్డు వెంబడి ప్రయాణించే ప్రయాణికులకు తీవ్ర సమస్య తలెత్తుతుందన్నారు.

# కస్వాశ్రీకాంత్ మరణం చాలా బాధాకరం. పోచంపల్లి రమణారావు

శేరిలింగంపల్లి. నీలగిరి వార్త



హైదరాబాద్ ఏప్రిల్ 7..
కస్వా శ్రీకాంత్ ( 48) రెవెన్యూ శాఖలో పనిచేస్తున్న శ్రీకాంత్ 6బి4-25 అకాల మరణం చెందారు. వీరి పార్థీవదేహాన్ని సందర్శించిన తెలంగాణ రాష్ట్ర బ్రాహ్మణ సేవా సమితి రాష్ట్ర అధ్యక్షులు పోచంపల్లి రమణారావు తన ప్రగాఢ సంతాపాన్ని కుటుంబ సభ్యులను కలిసి తెలియజేశారు. శ్రీకాంత్ తెలంగాణ బ్రాహ్మణ సేవా సమితి రంగారెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యులుగా పనిచేశారు. వారి మరణం సంఘానికి తీరని లోటు అనివారిని తలచుకొని వారి కు టుంబ సభ్యులకుసంతాపాన్ని తెలియజేశారు. ఇంకా ఈ కార్యక్ర మంలో తెలంగాణ బ్రాహ్మణ సేవా సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు దేవులపల్లి రంగారావు. మరొక రాష్ట్ర ఉపాధ్యక్షులు కాణాల శ్యామసుందర్రావు. రాష్ట్ర కోశాధికారి మంత్రి సునీల్ కుమార్. రంగారెడ్డి జిల్లా సహాయ కార్యదర్శి దేవులపల్లి అశోక్ కుమార్. ప్రచార కార్యదర్శి గూడ జయరాం. నరువా రఘు. గుండం రాజ్ సత్య ప్రకాష్ పోచంపల్లి మధుసూదన్ రావుతదితర బ్రాహ్మణ సంఘ సభ్యులు హాజరై వారి మరణానికి సంతాపాన్ని తెలియజేశారు.

# 14వ వార్డులో సిఎం సహాయ నిధి చెక్కు అందజేత

**చెక్కు అందచేసిన పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు,వార్డు ఇంచార్జ్ కొల్లపూడి యోహాను.**

నీలగిరి వార్త,హుజూర్ నగర్

పౌరసరఫరాల,నీటిపారుదల శాఖ మంత్రి కెప్టెన్ ఉత్తంకుమార్ రెడ్డి సహాయ సహకారంతో సూర్యాపేట జిల్లా హుజూర్ నగర్ నియోజకవర్గ కేంద్రంలోని 14వ, వార్డులో అనారోగ్యంతో బాధపడుతున్న బాధితునికి సీఎం సహాయ నిధి నుంచి 60 వేల రూపాయల చెక్కును సోమవారం పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తన్నీరు మల్లికార్జున్, 14వ,వార్డు కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొల్లపూడి యోహాన్ అందించారు. హుజూర్ నగర్ పట్టణం 14వ, వార్డుకు చెందిన బాధితుడు బైరం వెంకయ్య కు 60 వేల రూపాయల చెక్ అందించిన పిదప హుజూర్ నగర్ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినతరువాత సీఎం సహాయ నిధి నుంచి అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి చెక్కులు వస్తున్నాయని,రాజీవ్ ఆరోగ్య భీమా పథకం కింద 10 లక్షల వరకు అన్ని వైద్యశాలలలో వైద్యం అందిస్తున్నారని,ఇట్టి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. బాధితుడు పేదరికంలో ఉంటూ అనారోగ్యంతో బాధపడుతున్న బైరం వెంకయ్య కుటుంబానికి తప్పకుండా సహాయం చేసేలా మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి దృష్టికి తీసుకెళ్తామని,గత మున్సిపల్ ఎన్నికల్లో 14వ,వార్డు నుంచి సిపిఎం పార్టీ అభ్యర్థిని నిలబెట్టినా ఇక్కడున్న ఇంచార్జ్ యోహాన్,పార్టీ




నాయకులు అందరూ కలిసి గెలిపించారని,ఈసారి పార్టీని నమ్ముకుని కష్టపడ్డ వారికి ప్రతి విషయంలో తప్పకుండా న్యాయం జరుగుతుందని, రామస్వామి గుట్ట దగ్గర ఇండ్ల విషయంలో కాని,ప్రభుత్వ ఇచ్చే ఇండ్ల విషయంలో కాని,రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే ఏ పథకంలో నైనా ఈ వార్డు విషయంలో అర్హులైన ప్రతి ఒక్కరికి న్యాయం జరిగేలా చూస్తామని అన్నారు.

ఈ కార్యక్రమంలో కొల్లపూడి యోహాన్,పెద్దారపు రామకృష్ణ,దుగ్గి సైదులు,కొల్లపూడి కాంతయ్య,మామిడి అశోక్,కొల్లపూడి ప్రవీణ్,కుడితొటి నిఖిల్, మువ్వా బాబు,మువ్వ నరేష్,ఎడవల్లి వీరబాబు,సలిగంటి గణేష్, కుడితట్టు ఏసు,అంతటి నరసయ్య,కొల్లపూడి మనోజ్, జగదీష్, ఇస్మాయిల్,మహిళలు రాధా, జ్యోతి, కాంతమ్మ, రోజమ్మ,చిన్న పార్వతి, వెంకమ్మ, కమల, సువార్త,వరమ్మ, విజయ్ రాణి,మాదారాణి,నిర్మల,పద్మ, శ్రీవిద్య, చిలక, మంగమ్మ, సుజాత, భాగ్యమ్మ,సుధాకర్,పార్వతి,లింగయ్య, మరియమ్మ తదితరులు పాల్గొన్నారు.

# తారానగర్ తుల్జభవాని దేవాలయంలో అమ్మ వారి మూల మంత్ర యాగం





శేరిలింగంపల్లి. . నీలగిరి వార్త

తేదీ 12-04-25 నాడు శేరిలింగంపల్లి తారానగర్ తుల్జభవాని అమ్మవారి దేవాలయంలో శనివారం చైత్ర పౌర్ణమి సందర్భంగా అమ్మ వారి మూల మంత్ర యాగం 20204 సంఖ్య తో నిర్వహించ బడుతుందని ఆలయ పూజారి తెలిపారు.కావున భక్తులు అధిక సంఖ్య లో పాల్గొనగలరని తెలిపారు.

# ఇండ్లు లేని లబ్ధిదారులకు గూడు కల్పించాలని సిపిఐ నేతల ఆందోళన

**మండల కార్యదర్శి రామక్రిష్ణ డీసీ ప్రశాంతికి వినతి పత్రం అందజేత**





శేరిలింగంపల్లి. నీలగిరి వార్త

అర్హులైన లబ్ధిదారులకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇవ్వాలని. శేరిలింగంపల్లి ఎమ్మార్వో, డిప్యూటీ కమిషనర్ ప్రశాంతికి శేరిలింగంపల్లి సిపిఐ కార్యదర్శి రామకృష్ణ లతోపాటు కామ్రేడ్స్ వినతి పత్రాన్ని సమర్పించారు, ఈ సందర్భంగా డిసి ప్రశాంతి వెంటనే స్పందించి రంగారెడ్డి జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకు వస్తానని ఎంతమంది పేర్లు ఉన్నాయో వాటి లిస్టు తయారుచేసి నాకు ఇవ్వాలని డి సి రామకృష్ణను కోరారు, ఈ సందర్భంగా కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తలు సంతోషం వ్యక్తం చేస్తూ సిపిఐ కార్యదర్శి రామకృష్ణ, డీసీ ప్రశాంతికి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాపిరెడ్డి కాలనీ సిపిఐ పార్టీ కార్యదర్శి కే.బి రాజు, కొండల్, ఎస్ నారాయణ రఘు ఆంజనేయులు కృష్ణ లలితమ్మ, చంద్రమ్మ అనిత, తదితర నాయకులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

**కొనుగోలు కేంద్రం ప్రారంభించిన సూర్యాపేట తహసీల్దారు శ్యామ్ సుందర్ రెడ్డి**

నీలగిరి వార్త, సూర్యాపేట:-

రైతులు పండించిన ప్రతి ధాన్యం గింజ కొనుగోలు చేస్తామని సూర్యాపేట తహసీల్దారు శ్యామ్ సుందర్ రెడ్డి అన్నారు. సూర్యాపేట రూరల్ మండలం గాంధినగర్ నందు పిఎసిఎస్ పిల్లలమర్రి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం నాడు సూర్యాపేట తహసీల్దారు శ్యామ్ సుందర్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల నుండి ధాన్యం కొనుగోలు చేయడానికి సూర్యాపేట మండలంలో 37 కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం ఆధ్వర్యంలో ఏడు కేంద్రాలు, ఐకెపి ఆధ్వర్యంలో 23 కేంద్రాలు, మెప్మా ఆధ్వర్యంలో ఏడు కేంద్రాలు మొత్తం 37 కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల ప్రకారం రైతుల నుండి ధాన్యం కొనుగోలు చేసిన తరువాత 48 గంటలలో రైతుల బ్యాంకు ఖాతాలకు నగదు జమ చేయడం జరుగుతుందని అన్నారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా కొనుగోలు



చేసిన ధాన్యం వెంటనే రవాణా చేసే విధంగా ఏర్పాట్లు చేసనట్లు చెప్పారు. వేసవికాలం కాబట్టి తేమశాతం తక్కువగానే వుంటుందని, ఒక వేళ అకాల వర్షాలు వచ్చినప్పటికి ప్రతి గింజ ధాన్యం కొనుగోలు చేయాలని రైసు మిల్లర్లకు జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారీ చేసినట్లు చెప్పారు. రెవెన్యూ, వ్యవసాయ, మార్కెటింగ్ శాఖల పర్యవేక్షణలో ధాన్యం కొనుగోలు చేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి సందీప్, ఎఎవొ స్వాతి, పిఎసిఎస్ సిబ్బంది వెంకటేశ్వర్లు, నాగరాజు, నవకాంత్, వీరయ్య , రైతులు పాల్గొన్నారు.

# శ్రీ కోదండ రామాలయంలో సామూహిక కుంకుమ పూజ



దేవరకొండ నీలగిరి వార్త

దేవరకొండ పట్టణంలోని శ్రీ కోదండ రామాలయంలో శ్రీరామనవమి పురస్కరించుకొని రెండవ రోజు సోమవారం సామూహిక కుంకుమార్చన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ పురోహితులు ఉప్పల శ్రీనివాస్ శర్మ కుంకుమార్చన కార్యక్రమాన్ని నిర్వహించగా స్వామివారి పుష్పరదోత్సవం సాయంకాలం పట్టణ పురవీధుల గుండా ఊరేగించారు. ఈ కార్యక్రమంలో మహిళలతో పాటు ఆలయ అధ్యక్షులు గాజుల ఆంజనేయులు , ప్రధాన కార్యదర్శి బొడిగె రవీందర్ గౌడ్, కోశాధికారి వనపర్తి మురళి, గాజుల రాజేష్ ,వనం జగదీశ్వర్ ,తదితరులు పాల్గొన్నారు.

# తల్లి బిడ్డ ఆరోగ్యం ఆరోగ్యకర సమాజానికి పునాది

**మండల వైద్యాధికారి డాక్టర్ వేణుగోపాల్**



నీలగిరి వార్తహుజూర్ నగర్:

ఏప్రిల్ 7 ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా సూర్యాపేట జిల్లా హుజూర్ నగర్ నియోజకవర్గం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లింగగిరి గ్రామంలో ఆరోగ్య అవగాహన కార్యక్రమాన్ని సోమవారం ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా మండల వైద్యాధికారి డాక్టర్ వేణుగోపాల్ మాట్లాడుతూ ప్రపంచ ఆరోగ్య సంస్థ 2025 సంవత్సరానికి తల్లి,బిడ్డల ఆరోగ్యం తీసుకోవాల్సిన రక్షణ చర్యల గురించి ఈ సంవత్సరం అంతా ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.తల్లులు, నవజాత శిశువుల ఆరోగ్యం వ్యక్తులకే కాక మొత్తం సమాజ శ్రేయస్సుకు ఆధారమని, ఆరోగ్యకరమైన తల్లి ఆరోగ్యకరమైన తరానికి జన్మనిస్తుందని అన్నారు.ప్రజలు తమ జీవన శైలిలో మార్పులను చేసుకోవడం ద్వారా మెరుగైన ఆరోగ్యాన్ని సంపాదించుకొని సంతోషంగా జీవించవచ్చు అన్నారు. ఈ కార్యక్రమంలో పిహెచ్ఎన్ నూర్జహాన్ బేగం,సూపర్వైజర్ చల్ల పద్మ, ఇందిరాల రామకృష్ణ,అలివేలు,స్వరూప, లక్ష్మి,నర్సింగ్ అధికారి మరియమ్మ,ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా శ్రీ సీతారామచంద్ర స్వామి వారి పట్టాభిషేకం

నీలగిరి వార్త, సూర్యాపేట:-

సూర్యాపేట జిల్లా కేంద్రంలోని బొడ్రాయి బజార్ లో గల శ్రీ వేదాంత భజన మందిరంలో శ్రీసీతా రామ చంద్ర స్వామి వారి నవరాత్రి ఉత్సవములు పురస్కరించుకొని సోమవారం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి పట్టాభిషేక మహోత్సవాన్ని మందిర అర్చకులు ధరూరి సింగరాచార్యులు ధరూరి రాఘవచార్యుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మండపంపై సీతారామ లక్ష్మణ ఆంజనేయ స్వామి ఉత్సవమూర్తులకు అభిషేకాలు నిర్వహించి, భక్తులు సమర్పించిన పట్టు వస్త్రములు అలంకరింపజేసి శాస్త్రోక్తంగా ఈ పట్టాభిషేక మహోత్సవాన్ని కన్నుల పండుగగా నిర్వహించారు. కార్యక్రమంలో సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి సురేఖ దంపతులు పాల్గొని పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టాభిషేక మహోత్సవాన్ని భక్తులకు అర్చకులు



వివరించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో మందిర అధ్యక్షులు రాచర్ల వెంకటేశ్వరరావు ప్రేమలత, ప్రధాన కార్యదర్శి నకరికంటి రాజశేఖర్ హైమావతి, కోశాధికారి సోమ అశోక్ శోభ దంపతులు, కమిటీ సభ్యులు కర్నాటి రవి, కుక్కడపు శ్రీనివాసు, సోమ సుమన్, షీలా శంకర్ , మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# మైనంపల్లి గ్రామపంచాయతీలో చలివేంద్రం ప్రారంభం



దేవరకొండ నీలగిరి వార్త

నల్గొండ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు వేసవి కాలంలో ప్రజలకు మంచినీటి దాహార్తిని తీర్చేందుకు ప్రభుత్వం గ్రామపంచాయతీల ఆధ్వర్యంలో ప్రతి గ్రామంలో చలివేంద్రం ఏర్పాటు చేస్తుంది అందులో భాగంగా సోమవారం దేవరకొండ మండలం మైనంపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన చలివేంద్రం ను ఎంపీడీఓ డేనియల్ మాజీ ఎంపీటీసీ కొర్ర గౌతమి-రాంసింగ్ నాయక్ లు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ వెంకట్.పంచాయతీ కార్యదర్శి అంబెడ్కర్. నిరంజన్. కీర్తి. శ్రీకాంత్.గ్రామస్థులు ఎల్లయ్య.వెంకటయ్య.వీరయ్య.ముత్తయ్య. రామస్వామి.గురుకుల డిగ్రీ కళాశాల విద్యార్థులు తదితరులు ఉన్నారు.

# తక్షణమే ఉపాధిహామీ ఫీల్డ్ అసిస్టెంట్లకు జీతాలు అందించాలి

**"ఎంపీడీవో రమేష్ దీన్ దయాల్"కు వినతి పత్రం అందించిన ఉపాధిహామీఫీల్డ్ అసిస్టెంట్లు**

**ఫీల్డ్ అసిస్టెంట్లసంఘంరాష్ట్రకమిటీ సభ్యులు రెమిడాల లింగయ్య**

**దిక్కు తోచనిస్థితిలో క్షేత్ర సహాయకులు**

**ఫీల్డ్ అసిస్టెంట్లసంఘంమండల అధ్యక్షులు దొడ్డారపు నాగేశ్వరరావు**

మునగాల ప్రతినిధి (పాతకోట్ల నాగరాజు) నీలగిరివార్త: ఏప్రిల్ 7

మునగాల: మండలకేంద్రంలో స్థానిక మండలప్రజాపరిషత్ కార్యాలయంలో ఉపాధిహామీ ఫీల్డ్ అసిస్టెంట్ల సంఘం ఆధ్వర్యంలో గత మూడు నెలల నుండి జీతాలు రాక కుటుంబ పోషణకు ఇబ్బంది పడుతూ దిక్కుతోచని స్థితిలో ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్ల జీవనం సాగిస్తున్నారని ప్రతి గ్రామ



గ్రామాన ఉపాధి పనులు ముమ్మరంగా పనులు చేపిస్తూ కూలీలకు ఉపాధి సూపిస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్ లపై ప్రభుత్వం వెంటనే సానుకూలంగా స్పందించి జీతాలు ఇప్పించాలని స్థానిక ఎంపీడీవో కె రమేష్ దీన్ దయాల్, కు వినతి పత్రం అందజేయడం జరిగింది, ఇట్టి కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ల సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు రేమిడాల లింగయ్య, మునగాల మండల ఫీల్డ్ అసిస్టెంట్లసంఘం అధ్యక్షుడు దొడ్డారపు నాగేశ్వరరావు,కోశాధికారి సంద్యాల శ్రీను, కార్యదర్శి గంగుల శ్రీదేవి, తదితరులు పాల్గొన్నారు.

## వడ్ల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్



**కామారెడ్డి జిల్లా ప్రతినిధి: నీలగిరి వార్త:**
ఈ సందర్భంగా షబ్బీర్ ఆలీ మాట్లాడుతూ ప్రభుత్వం రైతుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను మండల రైతులు వినియోగించుకోవాలని కోరారు. రైతుల సంక్షేమం కోసం కాంగ్రెస్ కృషి చేస్తోందని, పండించిన ప్రతీ గింజను కొనుగోలు చేస్తామన్నారు. రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో మాత్రమే విక్రయించుకొని మద్దతు ధర పొందాలనిఅన్నారు. సన్న రకం వడ్లకు రాష్ట్ర ప్రభుత్వం రూ.500 బోనస్ ప్రకటించిందన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద ఇబ్బందులు కలుగనీయకుండా సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. రైతులకు గన్ని సంచుల కొరత, ఇతరత్రా సమస్యలు లేకుండా ప్రభుత్వం చూస్తుంది అన్నారు. ఈ కొనుగోలు కేంద్రాలను రైతుల ప్రయోనం కోసం ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు.

## బిక్కనూరు గ్రామ సచివాలయంలో కమ్యూనిటీ మెడిటేషన్ సెంటర్ ప్రారంభం



**బిక్కనూరు ఏప్రిల్ 07 (నీలగిరి వార్త)**
బిక్కనూరు గ్రామ సచివాలయంలో కమ్యూనిటీ మెడిటేషన్ సెంటర్‌ను సీఐ సంపత్ కుమార్ సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమం జిల్లా న్యాయ సేవా అథారిటీ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా సీఐ సంపత్ కుమార్, మాట్లాడుతూ, ప్రజలకు మెరుగైన న్యాయ సేవలు అందించేందుకు ఈ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ మెడిటేషన్ సెంటర్ల ద్వారా ప్రజలకు న్యాయం సులభంగా, సత్వరమైన విధంగా అందేలా చూస్తాం. ఇక్కడ సిబ్బంది నిరంతరం పనిచేస్తూ ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు సిద్ధంగా ఉన్నారు, అని సంపత్ కుమార్ వివరించారు. ఈ కేంద్రాలు సామాజిక సామరస్యాన్ని పెంపొందించడంతో పాటు వివాదాలను స్నేహపూర్వకంగా పరిష్కరించడంలో ఉపయోగపడతాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ ఆంజనేయులు, గ్రామ సచివాలయ కార్యనిర్వాహక అధికారి మహేశ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు. స్థానిక ప్రజలు ఈ కేంద్రం ఏర్పాటును స్వాగతిస్తూ, ఇది తమ గ్రామంలో న్యాయ సేవలను మరింత సమీపం చేస్తుందని అభిప్రాయపడ్డారు.

## బాలికల పాఠశాలలో ఉపగ్రహాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం



**బిక్కనూరు ఏప్రిల్ 07 (నీలగిరి వార్త)**
బిక్కనూరు బాలికల ఉన్నత పాఠశాలలో ఇస్రో (భారత అంతరిక్ష పరిశోధన సంస్థ) రిటైర్డ్ జూనియర్ ఇంజినీర్ రఘువర్మ ఆధ్వర్యంలో విద్యార్థులకు అంతరిక్ష ఉపగ్రహాల పనితీరుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపగ్రహాలు వివిధ రంగాలపై చూపే ప్రభావాన్ని రఘువర్మ వివరించారు.అంతరిక్ష సాంకేతికత ద్వారా ఉపగ్రహాలు వాతావరణ అంచనా, సమాచార సేకరణ, రవాణా, మరియు విద్యా రంగాలలో ఎలా సహకరిస్తాయో ఆయన విద్యార్థులకు తెలియజేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల్లో శాస్త్రీయ ఆసక్తిని పెంపొందించేందుకు ఆయన ప్రయత్నించారు.కార్యక్రమంలో మండల విద్యాధికారి (ఎంఈవో) రాజా గంగారెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు, మరియు విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం విద్యార్థులకు అంతరిక్ష శాస్త్రం పట్ల ఆసక్తిని కలిగించడంతో పాటు వారి జ్ఞానాన్ని విస్తరించే దిశగా ఒక ముఖ్యమైన అడుగుగా నిలిచింది.

## రాజన్న ఆలయ ఈఓ కె వినోద్‌కి ఉద్యోగుల యూనియన్‌చే ఘన సన్మానం

**నీలగిరి వార్త వేములవాడ ప్రతినిధి**



వేములవాడ రాజన్న ఆలయంలో శ్రీ రామనవమి నవరాత్రి ఉత్సవాలు ఘనంగా పూర్తి అయిన సందర్భంగా సోమవారం ఆలయ ఉద్యోగుల యూనియన్ తరుపున ఆలయ ఈఓ కె వినోద్‌కి శాలువలతో సత్కరించి అభినందనలు తెలిపినారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఏఈఓ లు శ్రీమతి జయకుమారి శ్రవణ్ కుమార్ అశోక్ పర్యవేక్షకులు వరి నరసయ్య శ్రీకాంత్ సీనియర్ అసిస్టెంట్ లు పురాణం వంశీ బొడుసు మహేష్ లత దేవి మమతలతో పాటుగా ప్రధాన అర్చకులు మామిడిపల్లి రాములు చంద్రగిరి శరత్ గోపన్నగారి రఘు గౌతమ్ కూరగాయల శ్రీనివాస్ మరియు సుశీల్ పెంట శ్రీనివాస్ తదిరులుపాల్గొన్నారు.

## టీజీసీఈటీ-2025లో ఆరేపల్లి పాఠశాల విద్యార్థుల సత్తా - గురుకుల సీట్లతో గ్రామస్తులకు గర్వకారణం





**భిక్కనూర్ ఏప్రిల్ 7 (నీలగిరి వార్త) :**
ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు తమ అర్హతతో గురుకుల విద్యా అవకాశాలను అందిపుచ్చుకుంటూ ఉన్నత విజయాలు సాధిస్తున్నారు. తాజాగా టీజీసీఈటీ-2025 (తెలంగాణ గురుకుల 5వ తరగతి ప్రవేశ పరీక్ష) ఫలితాల్లో రాజంపేట మండల పరిధిలోని ఆరేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు తమ ప్రతిభను చాటారు. ఈ పాఠశాలలో నాలుగో తరగతి చదువుతున్న ఐదుగురు విద్యార్థులు ఈ పరీక్షకు హాజరైన వారిలో మాసుల వర్షిత్, బీర్కూరు రూపేష్, దివన్‌లు గురుకులాల్లో సీట్లు సాధించి సత్తా చాటారు. ఈ విజయాన్ని పురస్కరించుకుని సోమవారం పాఠశాలలో ఉపాధ్యాయ బృందం విజేతలైన విద్యార్థులను ఘనంగా సన్మానించింది. ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్థులు పాల్గొని వారిని అభినందించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బి. నగేష్ మాట్లాడుతూ, "ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు కూడా అపార అవకాశాలు ఉన్నాయి. సరైన మార్గదర్శకత్వం, ప్రోత్సాహంతో వారు అద్భుత ఫలితాలు సాధించగలరు," అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎమ్. ఎస్. అనురాధ, తిరుపతి, శ్రీకాంత్, హాజీ, వీవీలు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు. ఈ విజయం గ్రామస్తులను గర్వపడేలా చేసింది.

## మహాత్మ జ్యోతి భాయ్ పూలే 199వ జయంతి మహోత్సవ వేడుకలను నిర్వహించేందుకు సహకరించగలరు

### జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

**కామారెడ్డి జిల్లా ప్రతినిధి: నీలగిరి వార్త:**
జిల్లా కలెక్టర్ మరియు జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ల అధ్యక్షతన కామారెడ్డి జిల్లాలో గల బి.సి.సంఘాల నాయకులు , ఎస్సీ మరియు వివిధ విద్యార్థి సంఘాల ప్రతినిదులతో మహాత్మ జ్యోతి భాయ్ పూలే 199 వ జయంతి మహోత్సవ తేది. 11.04.2025 ( శుక్రవారం )నాడు ఏర్పాటుకు సంబంధించి సన్నాహక సమావేశం తేదీ: 07-04-2025 మధ్యాహ్నం 03:00 గంటలకు సమీకృత జిల్లా కార్యాలయ సముదాయం హాల్, కామారెడ్డి నందు నిర్వహించడం జరిగినది . ఈ సమావేశంలో జయంతి ఉత్సవాల నిర్వహణకు సంబంధించిన కార్యక్రమాలు, ఏర్పాట్లు, అధికారిక సమన్వయం, అలాగే బి.సి. సంఘాల భాగస్వామ్యం తదితర అంశాలపై చర్చించడం జరిగినది .



కావున, జిల్లాలోని అన్ని బిసి సంఘాల నాయకులు, ఎస్సీ మరియు వివిద విద్యార్థి సంఘాల ప్రతినిదులు జయంతి మహోత్సవాల కు హాజరై ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించేందుకు సహకరించగలరు అని ఆశిష్ సాంగ్వాన్ కలెక్టర్ మరియు జిల్లా మేజిస్ట్రేట్, కామారెడ్డి తెలియజేశారు.

## అంగన్వాడీ కేంద్రంలో చిన్నారులకు కంటి పరీక్షలు

**బిక్కనూర్ ఏప్రిల్ 07 (నీలగిరి వార్త)**
బిక్కనూర్‌లోని అంగన్వాడీ కేంద్రంలో చిన్నారుల కంటి ఆరోగ్యాన్ని పరిరక్షించేందుకు ప్రత్యేక కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆరు సంవత్సరాల లోపు పిల్లలందరికీ కంటి పరీక్షలు నిర్వహించినట్లు కంటి వైద్యాధికారి రవీందర్ పటేల్ తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు ఆయన వెల్లడించారు. అంగన్వాడీ కేంద్రంలో చదువుకుంటున్న పిల్లల కంటి ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు రవీందర్ పటేల్ పేర్కొన్నారు. ఈ పరీక్షల ద్వారా దృష్టిలోపం ఉన్న చిన్నారులను గుర్తించాము. వారికి అవసరమైన కంటి అద్దాలను ఉచితంగా పంపిణీ చేయడం జరుగుతుంది, అని ఆయన వివరించారు. ప్రభుత్వం చిన్న వయస్సులోనే పిల్లల కంటి సమస్యలను గుర్తించి, సకాలంలో చికిత్స అందించే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తోందని వైద్యాధికారి తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా పిల్లల భవిష్యత్ ఆరోగ్యానికి బలమైన పునాది వేస్తున్నామని



ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. అంగన్వాడీ సిబ్బంది, వైద్య బృందం సహకారంతో ఈ పరీక్షలు సజావుగా పూర్తయ్యాయి. దీనితో పాటు తల్లిదండ్రులకు కూడా పిల్లల కంటి ఆరోగ్యం పట్ల అవగాహన కల్పించే ప్రయత్నం చేసినట్లు సంబంధిత అధికారులు తెలిపారు.

## శ్రీ వెంకటేశ్వర కళ్యాణ మహోత్సవానికి రావలసిందిగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు ఆహ్వానం

### ఎదురుగట్ల మాజీ సర్పంచ్ సోయినేని కరుణాకర్ దేవస్థాన కమిటీ





**నీలగిరి వార్త వేములవాడ ప్రతినిధి**
వేములవాడ రూరల్ మండలం ఎదురుగట్ల గ్రామంలో వైభవంగా నిర్వహించే శ్రీ వెంకటేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవానికి ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ను రావాల్సిందిగా కోరుతూ దేవస్థాన కమిటీ సభ్యులు ఆహ్వాన పత్రికను అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చేతుల మీదుగా కళ్యాణ మహోత్సవానికి సంబంధించిన పోస్టర్ ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎదురుగట్ల మాజీ సర్పంచ్ సోయినేని కరుణాకర్ దేవస్థాన కమిటీ ఛైర్మన్ సంపేట గంగరాజు వైస్ ఛైర్మన్లు పొన్నం బాలయ్య నరెడ్ల రాఘవరెడ్డి కమిటీ సభ్యులు కోడం గంగాధర్ పొన్నం మల్లేశం సోయినేని రాజు పొన్నం నాగేందర్ అర్చకులు కార్తీక్ మకులభరణం శ్రీనివాస్ వంగపల్లి మల్లేశం బండ శ్రీనివాస్ సంఘ స్వామి పొన్నం రాజేశం కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## పేదవారికి కడుపునిండా సన్న బియ్యంతో భోజనం

### గిరిజన బిడ్డా ఇంట్లో భోజనం చేసిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

### అనంతరం తండా వాసులతో సరదాగా నృత్యాలు చేసిన ప్రభుత్వ విప్





**నీలగిరి వార్త వేములవాడ ప్రతినిది**
రాష్ట్రంలోని ప్రతి నిరుపేదలు సన్న బియ్యంతో అన్నం తినాలన్న లక్ష్యంతో ప్రతిష్టాత్మకంగా సన్నబియ్యం పంపిణీని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించిన నేపథ్యంలో రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం నిమ్మపల్లి గ్రామం జేసేవలాల్ తండా లో గిరిజన బిడ్డ ఇస్లావత్ మధుకర్ ఇంట్లో వారి కుటుంబ సభ్యులతో కలిసి రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ స్వయంగా సహపంక్తి భోజనం చేశారు ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ లబ్ధిదారుడి కుటుంబ యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. సన్నబియ్యం ఎలా ఉన్నాయంటూ కుటుంబ సభ్యులను తండా వాసులను ప్రభుత్వ విప్ అడిగి తెలుసుకున్నారు దొడ్డు బియ్యం పంపిణీ చేసినపుడు అసలు వాటిని తీసుకునేందుకే ఆసక్తి చూపేవాళ్లం కాదని ఇప్పుడు సన్నబియ్యం ఇవ్వడంతో కుటుంబానికి ఉపయోగంగా ఉంటుందని సంతోషం వ్యక్తం చేశారు తండా పరిధిలో అనాడు కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అందించిన మంచి నీరు ఇప్పటికి తాగుతున్నమని తెలిపారు తామంతా ఏప్పటికి కాంగ్రెస్ పార్టీకి రుణపడి ఉంటామని ఆనందం వ్యక్తం చేశారు.

## జంగంపల్లి కేజీబీవీలో ఆరోగ్య శిబిరం



**బిక్కనూర్ ఏప్రిల్ 7 (నీలగిరి వార్త)**
బిక్కనూర్ మండల్‌లోని జంగంపల్లి కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ) వసతిగృహంలో ఆరోగ్య శిబిరం నిర్వహించినట్లు రాజంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ విజయ మహాలక్ష్మి తెలిపారు. ఈ శిబిరంలో మొత్తం 48 మంది బాలికలకు వైద్య పరీక్షలు నిర్వహించగా, వారిలో 42 మంది విద్యార్థులకు అవసరమైన మందులు అందజేశామని ఆమె పేర్కొన్నారు. విద్యార్థుల్లో ఆరోగ్యంపై అవగాహన పెంచేలా సూచనలు ఇచ్చినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో సూపర్వైజర్ మంజూర్, ఏఎన్ఎంలు శ్రీలత, హాస్టల్ స్టాఫ్ నర్స్ తదితరులు పాల్గొన్నారు.

## బిజెపి ఎమ్మెల్సీలను సన్మానించిన బిజెపి జిల్లా అధ్యక్షులు కులచారి దినేష్





**కామారెడ్డి జిల్లా ప్రతినిధి: నీలగిరి వార్త:**
రాష్ట్ర బీజేపీ కార్యాలయంలో ప్రమాణ స్వీకారం చేసిన తరువాత మొదటి సారి బీజేపీ రాష్ట్ర కార్యాలయానికి రావడం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్సీలు చిన్నమలై అంజి రెడ్డి, మల్క.కొమురయ్యలను సన్మానించారు. ఈ సందర్భంగా కులాచారి దినేష్ పటేల్ మాట్లాడుతూ ఈ విజయం బీజేపీ కార్యకర్తల కృషి ఫలితం.గెలిచిన ఎమ్మెల్సీలు ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకోవాల్సిన బాధ్యతను గుర్తుంచుకొని, పార్టీ సిద్ధాంతాలకు నిబద్ధంగా సేవ చేయాలి. రాష్ట్రంలో బీజేపీని మరింత బలంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరు చొరవ తీసుకోవాలి.పార్టీని బలోపేతం చేయడమే లక్ష్యంగా మనం దరం ముందుకు సాగాలి అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ఎమ్మెల్యేలు ధన్ పాల్ సూర్యనారాయణ, పైడి రాకేష్ పాల్గొని ఎమ్మెల్సీలను అభినందించారు.

## సరస్వతీ శిశు మందిర్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ లో ఉచిత వైద్య శిబిరం



**నీలగిరి వార్త వేములవాడ ప్రతినిధి**
శ్రీ సత్య సాయి సంజీవని సెంటర్ ఫర్ హెల్త్ హెల్త్ కేర్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు
శ్రీ సరస్వతీ శిశు మందిర్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ వేములవాడలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో వైద్యులు విద్యార్థులకు గుండెకు సంబంధించిన పరీక్షలు మరియు హైట్ వెయిట్ మొదలైన పరీక్షలు చేశారు. అలాగే సువర్ణ ప్రాసన కార్యక్రమం నిర్వహించారు.సువర్ణ ప్రాసనం అంటే చిన్న పిల్లల్లో మెదడు చురుకుదనం బలాన్ని పెంచడం కోసం వేసే ఒక ఆయుర్వేదిక్ మందు. ఈ సువర్ణ ప్రాసనం నర్సరీ నుండి 12 సంవత్సరాల పిల్లలకు వేయించడం జరిగింది.ముందుగా ధన్వంతరీ యజ్ఞం నిర్వహించి కార్యక్రమం నిర్వహించారు.
వైద్య శిబిరం నిర్వహించిన సత్యసాయి సంజీవని సెంటర్ వాళ్లు మాట్లాడుతూ పిల్లలకు వారి ట్రస్ట్ తరపున ఉచిత వైద్యం అం దజేస్తామని తెలిపారు కాగా ఈ కార్యక్రమంలో పాఠశాల కమిటీ సభ్యులు యాచమనేని శ్రీనివాస రావు కొమురవెల్లి సంతోష్ సమితి కార్యదర్శి గర్శకుర్తి వెంకటేశ్వర్లు కోశాధికారి నమిలికొండ నరహరి పాఠశాల ప్రధానాచార్యులు మ్యాన రాంప్రసాద్ మరియు ఆచార్యులు మాతాజీలు పాఠశాల తల్లిదండ్రులువిద్యార్థులు పాల్గొన్నారు.